# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

సూర్య www.suryaa.com 18వ వసంతంలోకి...

visit us @ http://epaper.suryaa.com

బుధవారం | 2 అక్టోబర్ 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 302

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...




APPSC,TSPSC

పోటీపరీక్షల గైడెన్స్

నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్

కరెంట్ అఫైర్స్

నమూనా ప్రశ్నాపత్రాలు

విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, భాద్రపద మాసం అమావాస్య రా.10.42 వరకు, ఉత్తర మ.12.20, వర్జ్యం రా.9.39 నుంచి 11.25 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు దుర్ముహూర్తం ఉ.11.23 నుంచి 12.10 వరకు



## బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న స్కూల్ బస్సు
- 25 మంది చిన్నారులు మృతి
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- ప్రమాద సమయంలో 44 మంది విద్యార్థులు
- దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ.. సంతాపం తెలిపిన ప్రధాని షినవత్ర



6లో

## అంబానీ ఖర్చుపెట్టిందంతా ప్రజల సొమ్మే



6లో

- బీజేపీపై విరుచుకు పడిన రాహుల్ గాంధీ
- మోడీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టారు
- బహదూర్‌ఘర్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రోడ్‌షో

## కులాల మధ్య చిచ్చుపెడుతున్న కాంగ్రెస్

**హర్యానా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పై మోడీ ధ్వజం**

- దేశ ఐక్యతకు కాంగ్రెస్ విఘాతం కలిగించేందుకు వెనుకాడడం లేదు
- రామమందిర నిర్మాణానికి అడ్డుపడింది
- జమ్మూకశ్మీర్‌లో సంపూర్ణంగా రాజ్యాంగాన్ని అమలు కానీయలేదు
- అసెంబ్లీల్లో, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ పాటించలేదు



6లో

## నిలకడగా రజనీకాంత్ ఆరోగ్యం

- మరో రెండు రోజుల్లో డిశ్చార్జ్
- ఆసుపత్రి వర్గాల వెల్లడి
- తీవ్ర కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరిన రజనీకాంత్

ప్రముఖ నటుడు రజనీకాంత్ ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ను అపోలో ఆస్పత్రి వర్గాలు విడుదల చేశాయి. ఆయన హృదయ నాళానికి సంబంధించి చికిత్స చేసినట్టు వెల్లడించాయి.



2లో

## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు



5లో

- రోజంతా ఒడిదుడుకుల్లో కొనసాగిన స్టాక్ మార్కెట్
- 33 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 13 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## త్వరలో ఏపీలో హైడ్రా


- రాష్ట్ర వ్యాప్తంగా కూల్చివేతలు
- మంత్రి నారాయణ సంచలన వ్యాఖ్యలు
- వరదలు విజయవాడలో అల్లకల్లోలం సృష్టించడం లోకమంతా చూసింది
- ఆపరేషన్ బుడమేరు మాదిరిగా అక్రమ నిర్మాణాలపై దృష్టి పెడతాం : మంత్రి నారాయణ



7లో

## గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాయలసీమ


- కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేస్తాం...జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం
- గుండ్రేవుల, గురు రాఘవేంద, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు
- దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేత
- వచ్చే డిసెంబర్ నెలాఖరుకు డీఎస్సీ పరీక్షలు పూర్తి చేసి టీచర్ పోస్టుల భర్తీ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి పెన్షన్ల పంపిణీ
- పుచ్చకాయలమాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- పత్తికొండ నియోజకవర్గం, పుచ్చకాయలమాడ గ్రామంలో పేదల సేవా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు




2లో

రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేస్తాం.

## అంతో ఇంతో!




నిద్రతో పాటు ఇళ్లు కూడా లేకుండా చేస్తున్నారు సార్

## తెలుగు రాష్ట్రాలకు వరద సాయం



వివరాలు-6లో

- రాష్ట్రాలకు 1450 కోట్లు
- ఏపీకి రూ.1036 కోట్లు, తెలంగాణకు రూ.416కోట్లు
- అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1432 కోట్లు విడుదల
- ఎన్డీఆర్ఎఫ్ నుంచి కేంద్ర వాటా రిలీజ్

## రాజకీయ కుట్రలకు ఆమె బాధితురాలు



6లో

- తప్పుడు ఫిర్యాదులతో నా ఫ్యామిలీని వివాదాల్లోకి లాగారు
- భార్య పార్వతి గురించి సిద్ధరామయ్య వ్యాఖ్యలు
- లేఖ విడుదల చేసిన సిద్ధరామయ్య భార్య
- ముడకు చెందిన 14 ప్లాట్లు తిరిగి అదే సంస్థకు ఇచ్చేసిన పార్వతి

## కశ్మీర్‌లో ప్రశాంతంగా పోలింగ్



2లో

- చివరి విడత భారీగా ఓటింగ్ నమోదు
- జమ్ములో 24, శ్రీనగర్ లోయలో 15 కలిపి మొత్తం 40 స్థానాల్లో పోలింగ్
- 415 మంది అభ్యర్థుల భవితను తేల్చే ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన 39.18 లక్షల ఓటర్లు
- ఈనెల 8న ఎన్నికల ఫలితాలు

## మళ్లీ ఆందోళనలు చేపట్టిన డాక్టర్లు




6లో

- తమ భద్రతపై నమ్మకం లేదని ఆరోపణ
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి కనిపించనందుకే మళ్లీ ఆందోళనలు
- విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగిస్తాం
- జూనియర్ డాక్టర్లు

# సీఎం చంద్రబాబుకు వచ్చిన సమాచారంతో ప్రకటించారు : పురంధేశ్వరి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబుకు వచ్చిన సమాచారంతో ఆయన ప్రకటన చేశారని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. అధికారులతో సమీక్ష చేసుకున్న తర్వాతే తిరుమల లడ్డూ విషయంపై మాట్లాడి ఉంటారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో దగ్గుబాటి పురంధేశ్వరి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి.. ఆయా సమస్యలపై అధికారుతో మాట్లాడారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ... సీఎంగా ఆయన అపచారం జరిగిన విషయాన్ని ప్రజలకు తెలియ చెప్పి ఉంటారని చెప్పారు. ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు ఎలా అమలవుతున్నాయనేది పరిగణలోకి కోర్టు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుని మీరు ఎందుకు అలా మాట్లాడారు అని కోర్టులకు అడిగే హక్కు ఉంటుందా అనేది అందరూ ఆలోచన చేయాలి. లడ్డూ విషయంలో న్యాయస్థానంలో కూడా విచారణ జరుగుతుంది. వివిధ సమస్యలపై ప్రజలు విజ్ఞాపన పత్రాలు అందిస్తున్నారని అన్నారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ చేసి మాట్లాడుతున్నాం. భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నందున.. ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపిస్తున్నాం. బదిలీలు, ఉపాధి అవకాశాలపై కూడా వినతి పత్రాలు ఇస్తున్నారు.

ప్రైవేటు సంస్థలకు అయితే ఫోన్ చేసి చెబుతున్నాం. వారధి అనే కార్యక్రమం ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగానే పని చేస్తుంది. ఈరోజు కూడా భూ వివాదాలు రాగానే... ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపిస్తున్నాం అని దగ్గుబాటి పురంధేశ్వరి వెల్లడించారు.

# గ్రీన్ ఎనర్జీ హబ్‌గా రాయలసీమ



- కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేస్తాం...జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం
- గుండ్రేవుల, గురు రాఘవేంద, ఆర్డీఎస్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు
- దీపావళి నుండి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేత
- వచ్చే డిసెంబర్ నెలాఖరుకు డీఎస్సీ పరీక్షలు పూర్తి చేసి టీచర్ పోస్టుల భర్తీ
- రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి పెన్షన్ల పంపిణీ
- పుచ్చకాయలమాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- పత్తికొండ నియోజకవర్గం, పుచ్చకాయలమాడ గ్రామంలో పేదల సేవా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాయలసీను గ్రీన్ ఎనర్జీ హబ్ గా మార్చుతాం. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. కర్నూలులో హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేస్తాం. వచ్చే దీపావళి పండుగ నుండి సూపర్ 6 పథకాల్లో భాగమైన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసి మీ ఇంట్లో దీపం వెలిగిస్తాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. కర్నూలు జిల్లా, పత్తికొండ నియోజకర్గం, పుచ్చకాయలమాడలో పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛను అందించి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ల అందజేత**

ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పెన్షన్లు రూ.4 వేలు అందిస్తున్నాం. ఎన్టీఆర్ తొలిసారి రూ.35లతో పింఛన్లను ప్రవేశపెట్టారు. 1996లో నేను రూ.75కు పెంచాను. 2014లో మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక 200 ఉన్న పింఛన్ ను వెయ్యి రూపాయలకు పెంచి తర్వాత రూ.2 వేలు చేశాను. కానీ గత ప్రభుత్వం సంవత్సరానికి రూ.250 చొప్పున వెయ్యి పెంచడానికి 5 ఏళ్లు సమయం తీసుకుంది. పెన్షన్లను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం మొత్తం ఒకటో తేదీ ఉదయమే పేదల సేవలో నిమగ్నం అయ్యేలా చర్యలు తీసుకున్నాం. రాష్ట్రవ్యాప్తంగా దాదావు 65 లక్షల మంది లబ్ధిదారులకు 12,580 కోట్లు చొప్పున సంవత్సరానికి 34 వేల కోట్ల రూపాయల పెన్షన్లను పేదవారికి పంచి వారి మొములలో చిరునవ్వులు చూస్తున్నాం. గత ప్రభుత్వంలో సీఎం మీటింగ్ అంటే పరదాలు కట్టేవారు.. చెట్లు కొట్టేసేవారు. గతంలో సీఎం మీటింగ్ అంటే ప్రజలకు నరకం కనిపించేది అని అన్నారు.

**ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం**

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించడానికి కృషి చేస్తున్నాం. పెన్షన్ల తరహాలోనే ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటో తేదీనే జీతాలు సక్రమంగా ఇస్తున్నాం. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయి.. వంద రోజుల ప్రణాళికలో అనేక కార్యక్రమాలు చేపట్టి లక్ష్యాలు సాధించాం. ప్రతి కుటుంబానికి అండగా ఉండి జీవన ప్రమాణాలు పెంచి మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 175 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. 15 రూపాయలకే టిఫిన్ తో పాటు రెండు పూటలా భోజనమును ఇచ్చి పేదవాడి కడువు నింపుతున్నామన్నారు. యువత నైపుణ్యానికి పదును పెట్టి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ సెన్సెస్ సెంటర్లను కూడా నెలకొల్పుతాం. 1995లో తాను సమైక్య ఆంధ్ర ముఖ్యమంత్రిగా ఉండి హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశా. ఇదే తరహాలో ఆంధ్ర రాష్ట్రానికి పూర్వయోగం తీసుకొచ్చేందుకు అందరి సహకారంతో కృషి చేస్తా. 1995 తరహా లోనే ప్రస్తుతం కూడా అధికారులను, రాజకీయ నాయకులను పరుగులు పెట్టించి పనులు చేయిస్తా అని అన్నారు.



**గత పాలకుల తప్పులుఇప్పుడు శాపాలు**

నేను సీఎంగా బాధ్యతలు తీసుకునే నాటికి ఖజానాలో చిల్లి గవ్వలేదు. రూ.10 లక్షల కోట్లు అప్పు ఉంది. ఇందుకు ప్రతినెలా లక్ష కోట్ల రూపాయల వడ్డీని చెల్లిస్తున్నాం. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ వినూత్న ఆలోచనలతో బయటపడే పరిస్థితికి రావడానికి ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వ పాలకుల తప్పులు ఇప్పుడు శాపాలుగా మారాయి. పత్తికొండ ప్రాంతంలో హంద్రీనీవా ప్రధాన కాలువ నుండి అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రాజెక్టు పనులు ప్రారంభించి పూర్తి చేసినప్పటికీ గత ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. వేదవతి, గురు రాఘవేంద్ర కెసి కెనాల్, గుండ్రేవుల ప్రాజెక్టులను అభివృద్ధి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే హంద్రీ నీవా నీళ్ళు వుచ్చకాయలుమాడ గ్రామానికి ఇస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.

**90 శాతం రాయితీతో డ్రిప్**

డ్రిప్ సౌకర్యం ద్వారా 90 శాతం సబ్సిడీతో బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రైతులకు మళ్ళీ ఇస్తాం. ధాన్యం రైతులకు రూ.1670 కోట్లు గత ప్రభుత్వం అప్పు పెడితే మేము వచ్చి వాటిని చెల్లించట రైతాంగాన్ని ఆదుకున్నాం. వైసీపీ ప్రభుత్వం చేసిన విధ్వంసం అంతాఇంతా కాదు. గత ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించడంలో నిర్వీర్యం అయిందని..ప్రస్తుతం అధికారులతో సమర్ధవంతంగా పనిచేయిస్తున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు డిసెంబర్ నెల ఆఖరుకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవి పూర్తయిన వెంటనే కొలువులు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. చదువుకున్న నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. యువత ఆసక్తి మేరకు సంబంధిత రంగాలలో నైపుణ్యం గల శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో 50% సమస్యలు భూ సంబంధిత సమస్యలే నాకు అర్జీల రూపంలో వస్తున్నాయి. వీటిని తెరదించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశాం. ప్రజల భూముల సరిహద్దులు చెరిపేశారు.. వాటిని సరిచేస్తున్నాం. భూములు అన్నింటినీ రీ సర్వే చేయించి ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తాం అని అన్నారు.

**గుండ్రేవుల, గురు రాఘవేంద్ర, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం**

ఉచిత ఇసుకను ఈనెల 15 నుండి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. స్థానికంగా అవసరాలు తీర్చేందుకు నదులు, వాగుల్లో ఉన్న ఇసుకను మీరే సొంతంగా తీసుకెళ్లొచ్చు. పోలవరం పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేయడంతో పాటు కృష్ణా డెల్టాలకు నీళ్లను తీసుకువచ్చి అక్కడి నుండి శ్రీశైలం తద్వారా రాయలసీమకు ప్రాంతానికి కరువు సమస్య లేకుండా చూస్తాం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర డ్యామ్ లో గేటు కొట్టుకుపోతే ఇక్కడి నుండే పర్యవేక్షించి మంత్రులను, అధికారులను మన రాష్ట్రంలో నిపుణులైన ఇంజనీర్ కన్నయ్య నాయుడును అక్కడికి పంపించి గేటును వునరుద్ధించడంతోపాటు నీళ్లను వృథా కాకుండా వినియోగించుకునే పరిస్థితి తీసుకొచ్చాం. పెండింగ్ లో ఉన్న గుండ్రేవుల, గురు రాఘవేంద్ర, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

**ఇండస్ట్రియల్ హబ్ గా ఓర్వకల్లు**

కర్నూలు నుండి బళ్లారి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు హైకోర్టు బెంచ్ ను కూడా ఏర్పాటు చేస్తాం. కర్నూలు నగరాన్ని చక్కటి నగరంగా చేయడమే గాక పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తాం. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్ గా మార్చుతాం. నూతన మద్యం పాలసీ విధానాన్ని తీసుకొచ్చి కల్తీ మద్యాన్ని అరికట్టాం. మద్యం విధానంలో శెట్టిబలిజ, ఈడిగ, గౌడలకు 10 శాతం రిజర్వేషన్లు. భారతదేశంలో ఆంధ్ర రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు స్వర్ణాంధ్ర2047 ప్రణాళిక తీసుకొస్తున్నాం. తెలుగువారు ముందు ఉండాలన్నదే నా లక్ష్యం. టెక్నాలజీ జీవితంలో పెను మార్పులు తీసుకొస్తుంది. డ్రోన్ టెక్నాలజీ ద్వారా ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి పరిష్కరించే దిశలో ప్రయత్నిస్తామన్నాం అని అన్నారు.

**పంచాయతీలకు మహర్దశ**

ఒకే రోజున 13,380 గ్రామసభలు నిర్వహించిన ఏకైక రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రం. 4,500 కోట్ల రూపాయలతో పనులు మంజూరు చేసి ప్రారంభించాం. గత ప్రభుత్వం రూ.990 కోట్ల రూపాయల పంచాయతీ నిధులను మళ్ళిస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక విడుదల చేశాం. దీంతో కేంద్రం ప్రభుత్వం నుండి 1200 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కేంద్రం వాటా ఇస్తోంది. రాష్ట్ర వాటా నిధులు కేటాయించి ఇంటింటికీ కుళాయి ద్వారా 3 ఏళ్లలో నీరు ఇస్తాం. ప్రతి ఇంటికీ కరెంట్, కుళాయి, సిలిండర్, టాయిలెట్ ఉండాలి. ఇళ్లు లేనివారికి సొంతిల్లు కట్టి ఇస్తాం. రాయలసీమలో చిన్న పరిశ్రమలను ప్రోత్సాహిస్తాం అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయితీ రాజ్, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో మూడు రోజుల పర్యటన నిమిత్తం నేటి మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న వీరికి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తదితర అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి గారు అలిపిరి శ్రీవారి పాదాల మెట్ల మార్గం చేరుకున్నారు. వీరికి తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తదితర అధికారులు ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. కాలి నడకన ఉప ముఖ్యమంత్రి రాత్రి 8 గంటలకు తిరుమల చేరుకుని రాత్రికి బస చేస్తారు. అక్టోబర్ 2 న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం 11.05 గంటలకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. బుధవారం రాత్రి తిరుమలలో బస చేస్తారు. అక్టోబర్ 3 న సా.4.30 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతిలో జరగనున్న వారాహి సభ కార్యక్రమంలో పాల్గొని రా8.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని విజయవాడ తిరుగుప్రయాణం కానున్నారు.

# హోమ్, రక్షణ శాఖల పార్లమెంటరీ కమిటీల్లో సభ్యునిగా విజయవాడ ఎంపీ


ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పార్లమెంటరీ స్థాయీ సంఘాలను వునర్ వ్యవస్థీకరిస్తూ 24 కొత్త కమిటీలను ఏర్పాటు చేసినట్లు లోక్ సభ సెక్రటరీ జనరల్ తెలిపారు.. ఈ వివరాలను లోక్ సభ సెక్రటరీ జనరల్ ఇటీవల శ్రీ పి.సి. మోడీ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వివిధ కమిటీల్లో తెలుగు రాష్టాల నుండి స్థానం దక్కించుకున్నారు. అందులో ముఖ్యంగా విజయవాడ లోక్ సభ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) హోం శాఖ, రక్షణ శాఖ కమిటీల్లో సభ్యులుగా ఎన్నికయ్యారు.. ఈ విషయాన్ని గెజిట్ ద్వారా తెలియచేసారు.

# సిట్ దర్యాప్తు నిలిపివేత : డీజీపీ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరవున న్యాయవాదులు చేసిన సూచన మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా విచారణ కొనసాగిస్తామని తెలిపారు.

# సీఐడీకి కాదంబరి జెత్వానీ కేసు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఈరోజు, రేపటిలోగా ఉత్తర్వులు ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద జరిగిన ఉన్నతస్థాయి భేటీలో ఈ కేసుపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో సీనియర్ పోలీసు అధికారులు నిందితులుగా ఉండటం, ముంబై లింక్‌ల నేపథ్యంలో సీఐడీకు ఇవ్వడం మంచిదని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం ఈ కేసులో ఇప్పటికే ప్రథమ నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో నిందితులుగా ఉన్న అప్పటి విజయవాడ సీపీ క్రాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, దర్యాప్తు అధికారి సత్యనారాయణ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. కేసు రెండు రాష్ట్రాల్లో దర్యాప్తు చేయాల్సి ఉండటంతో సీఐడీకి ఇవ్వాలని ప్రభుత్వానికి అధికారులు సూచించారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని నేడు, రేపటిలోగా ప్రభుత్వం నిర్ణయం ఉత్తర్వులను ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

# అంత హడావుడి అవసరం లేదు : బొత్స


## రాష్ట్రానికి లులు ప్రాజెక్టులు లాభదాయకం కావు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో లులు ప్రతినిధులు కలిస్తే.. దానిని పెద్ద హడావిడి చేస్తున్నారని మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పెట్టిన పెట్టుబడి.. స్థలం విలువలో సగం కూడా లేకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. అందుకే లులు గ్రూప్ విశాఖలో పెట్టుబడులు పెడతామంటే.. గతంలో తమ ప్రభుత్వం అంగీకరించలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రత్యామ్నాయంగా ఇన్ ఆర్బిట్ మాల్ తీసుకు వచ్చామని బొత్స సత్యనారాయణ తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో బొత్స సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో లులు గ్రూప్ సంస్థల పెట్టుబడి పెడతామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయన పై విధంగా స్పందించారు. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని కార్మికులను ఎట్టి పరిస్థితుల్లో తొలగించడానికి వీలు లేదని ఆయన ప్రభుత్వానికి స్పష్టం చేశారు.

స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అందుకు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. స్టీల్ ప్లాంట్‌లోని నాలుగు వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులు డిమాండ్లను సైతం అమలు చేయాలని కోరుతున్నామన్నారు. గతంలో ఎన్నికల వేళ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు.. స్టీల్ ప్లాంట్ కోసం ఏం చెప్పారో.. ఆ మాటకు కట్టుబడి ఉండాలని కోరుతున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాలను ఇస్తామన్నారని.. కానీ నేడు ఉన్న వాళ్ళని తొలగించే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పండగకు పప్పన్నం కాదు చారు అన్నం కూడా తినేటట్లు ఆ ఉద్యోగస్తులు లేరన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లను సైతం తొలగించే ప్రయత్నం జరుగుతుందని ఆయన మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వంలోని పెద్దలను కోరుతున్నానన్నారు. ఈ ప్రభుత్వం తీరు.. ఏరు దాటే వరు ఏటి మల్లన్న.. అ తర్వాత బోడి మల్లన్న అన్నట్లు ఉంది చెప్పారు. రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గిస్తున్నారు సరే.. నిత్యవసర వస్తువుల ధరల పరిస్థితి ఏంటని కూటమి ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు నగరాల్లో లులు గ్రూప్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. ఆ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడితో ఆ గ్రూప్ సంస్థల చైర్మన్ అమరావతిలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారు. ఇదే విషయాన్ని ఏపీ ప్రభుత్వం సోషల్ మీడియాలో పేర్కొంది. అయితే 2014లో ఏపీలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఇదే లులు గ్రూప్ విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పీఠాన్ని అందుకున్నారు. కానీ ఆ ప్రభుత్వ వైఖరితో లులు గ్రూప్ తమిళనాడు, తెలంగాణకు తరలిపోయింది. అయితే ఇటీవల ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయింది. దీంతో ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో లులు గ్రూప్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ పై విధంగా స్పందించారు.

# కొత్త మద్యం పాలసీ ప్రక్రియ ప్రారంభం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మద్యం పాలసీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ వివరాలు ప్రకటించారు. నేటి (మంగళవారం) నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాప్‌లకు లాటరీలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం షావులకు నోటిఫికేషన్ విడుదలైందని చెప్పారు. ఇక ప్రీమియర్ షావులకు, గీత కులస్తులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు.

**పూర్తి వివరాలు ఇవే..**

దరఖాస్తు రుసుము రెండు లక్షల రూపాయలని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. మూడు విధానాల్లో దరఖాస్తుల స్వీకరిస్తామని, జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల మధ్య ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఎంఆర్‌పీ కంటే అధిక రేటు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్మిట్ రూములకు, బెల్ట్ షావులకు అనుమతి లేదని తెలిపారు. ప్రీమియర్ షావులకు ఫీజును రూ.1 కోటిగా నిశాంత్ కుమార్ నిర్ధారించారు. మద్యం షావుల నిర్వహణపై నిరంతరం నిఘా ఉంటుందని, స్కూల్స్, టెంపుల్స్ ఉన్న చోట వంద మీటర్ల పరిధిలో ఎటువంటి మద్యం షావులకు అనుమతి లేదని క్లారిటీ ఇచ్చారు. మద్యం షావులు ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న అంశంపై నూతన మద్యం పాలసీలో నిబంధనలను పొందుపరిచామని, బీసీల పేరుతో షావులు వేరే వ్యక్తి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కశ్మీర్‌లో ప్రశాంతంగా పోలింగ్


- చివరి విడత భారీగా ఓటింగ్ నమోదు
- జమ్మూలో 24, శ్రీనగర్ లోయలో 15 కలిపి మొత్తం 40 స్థానాల్లో పోలింగ్
- 415 మంది అభ్యర్థుల భవితను తేల్చే ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన 39.18 లక్షల ఓటర్లు
- ఈనెల 8న ఎన్నికల ఫలితాలు



శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం చివరి విడత పోలింగ్ జరిగింది. ఉదయం నుంచి ఓటర్లు పోలింగ్ బూతులకు తరలివచ్చారు. ఎన్నికల సంఘం పిలువు మేరకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. జమ్మూకాశ్మీర్‌లో మూడు విడతల్లో పోలింగ్ జరిగింది. ఫస్ట్ ఫేజ్ సెప్టెంబర్ 18న జరిగింది. సెకండ్ విడత పోలింగ్ సెప్టెంబర్ 25న జరిగింది. ఇక చివరి విడత అక్టోబర్ 1న 40 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు భారీగా ఓటింగ్ నమోదైనట్లుగా సమాచారం.

జమ్మూ ప్రాంతంలో 24, కశ్మీర్ లోయలో 16 కలిపి మొత్తం 40 స్థానాల్లో బరిలో ఉన్న 415 మంది అభ్యర్థుల భవితను 39.18 లక్షల మంది ఓటర్లు తేల్చనున్నారు. 5,060 పోలింగ్ కేంద్రాల్లో దాదావు 20 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. 370 రాజ్యాంగ అధికరణం రద్దయిన తర్వాత ఓటుహక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గూర్ఖా తెగలవారు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారు. గత రెండు విడతల్లో నమోదైన ఓటింగ్ కంటే.. చివరి విడతలో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లుగా సమాచారం అందుతోంది. భారత ఎన్నికల సంఘం ప్రకారం.. 65.48% పోలింగ్ నమోదైందని తెలిపింది. లోక్‌సభ ఎన్నికల కంటే ఎక్కువగా ఓటింగ్ నమోదైంది. ఓటర్లు ఉత్సాహంగానే వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు. మొత్తం 90 నియోజకవర్గాలు ఉన్నాయి. మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. ఇక ఎన్నికల ఫలితాలు మాత్రం అక్టోబర్ 8న విడుదల కానున్నాయి. అయితే ఎగ్జిట్ పోల్స్ అక్టోబర్ 5న సాయంత్రం 5 గంటల వరకు విడుదల చేయొద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది. హర్యానాలో అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఆ ఎన్నికలు ముగిశాకే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాల్సి ఉంటుంది.

# నిలకడగా రజనీకాంత్ ఆరోగ్యం



చెన్నై: ప్రముఖ నటుడు రజనీకాంత్ ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్‌ను అపోలో ఆస్పత్రి వర్గాలు విడుదల చేశాయి. ఆయన హృదయ నాళానికి సంబంధించి చికిత్స చేసినట్టు వెల్లడించాయి. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, మరో రెండు రోజుల్లో డిశ్చార్జి అవుతారని తెలిపాయి. తీవ్ర కడువునొప్పితో రజనీకాంత్ సోమవారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండె నాళంలో సమస్య ఉన్నట్టు గుర్తించి స్టెంట్ వేశారు.మరోవైపు రజనీ ఆరోగ్యంపై ఆయన భార్య లత స్పందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. రజనీకాంత్ ఆసుపత్రిలో చేరినట్లు వార్తలు రావడంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఆయన క్షేమంగా ఉన్నారని తెలియడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయన కోలుకోవాలని ప్రార్థిస్తూ పోస్ట్‌లు పెడుతున్నారు. ప్రస్తుతం రజనీకాంత్ వేట్టయాన్, కూలీ సినిమాల్లో నటిస్తున్నారు. వేట్టయాన్ అక్టోబర్ 10న విడుదల కానుంది.



# ఇంద్రకీలాద్రిపై దుబాయ్ తరహాలో లైటింగ్

● దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

● ప్రకాశం బ్యారేజీ మీద కూడా అలంకరణ

విజయవాడ, ఏపీ బ్యూరో : దసరా ఉత్సవాలపై దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి రివ్యూ నిర్వహించారు. దసరా ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి అనే అంశాన్ని మంత్రి అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రేపటి నుంచే భక్తులు విజయవాడకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈనెల 9న మూల నక్షత్రం రోజున సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. దుబాయి మాదిరి ఫసాడా లైటింగ్ ఈసారి ప్రత్యేకంగా నిలవనుందని అధికారులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ మీద కూడా లైటింగ్ ఏర్పాటు చేసి ఇంద్రకీలాద్రి క్షేత్ర మహిమ తెలిపేలా లేజర్ షో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్యూలైన్లు అన్నీ పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని.. ప్రతీ వందడుగులకు అత్యవసర ద్వారాలు క్యూలైన్లలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మొదటిసారి భక్తుల కోసం వాటర్ బాటిళ్ల ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

వెయ్యిమంది ఒకేసారి తమ చెప్పులు, సామాన్లు పెట్టుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జల్లు స్నానాలకు ఘాట్ల వద్ద ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. హోల్డింగ్ ఏరియాల వద్ద 200 మంది చొప్పున ఉండేలా చూస్తున్నారు. శివాలయం వద్ద నుంచి తాత్కాలికంగా బయటకు వెళ్ళే మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. కళావేదిక, ప్రసాదాల కౌంటర్ లు ప్రత్యేకంగా అలంకరణ పెట్టనున్నారు. వీవీఐపీ ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు పనులు సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత , మంత్రి కొల్లు రవీంద్ర, పశ్చిమ ఎంఎల్ఏ సుజనా చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఈఓ తదితరులు పాల్గొన్నారు.




# త్వరలో కానిస్టేబుల్ నియామక ప్రక్రియ పూర్తి

● రకరకాల కారణాలతో నిలిచిన ఎంపిక ప్రక్రియకు కూటమి ప్రభుత్వ చొరవతో మోక్షం


● విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో అర్ధాంతరంగా ఆగిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. 6,100 పోస్టుల భర్తీకి సంబంధించిన శారీరక సామర్థ్య (పీఎంటీ,పీఈటీ) పరీక్షలను ఐదు నెలల్లోగా పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. గత 2022 కాలంలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షకు 4,59, 182 మంది హాజరుకాగా అందులో 95,209 మంది తదుపరి దశకు ఎంపికయ్యారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు కారణాల వల్ల వాయిదా పడడంతో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్ (సివిల్)- 3580బీ కానిస్టేబుల్ -2520 పోస్టుల ప్రక్రియ వాయిదా పడిందన్నారు.

ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు మొత్తం 3,622 మంది హోంగార్డులు హాజరవగా అందులో 382 మంది హోంగార్డులు మాత్రమే అర్హత సాధించారన్నారు. ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించని 100 మంది హోంగార్డులు 14 రిట్ పిటిషన్లను హైకోర్టులో వేశారు. "హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించడం ద్వారా హోంగార్డుల కోటాలో ప్రత్యేక మెరిట్ జాబితాను ప్రకటించాలని వారు కోర్టును కోరారు. ఆ వంద మంది హోంగార్డులను తదుపరి దశకు అనుమతించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని హోం మంత్రి వివరించారు. అప్పటి నుంచి రిక్రూట్మెంట్ ప్రక్రియను గత ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకుండా నిలిపివేసిన విషయాన్ని హోంమంత్రి గుర్తు చేశారు. ఈ విషయం ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికి వచ్చాకా, దీనిపై న్యాయ సలహా తీసుకొని.. ఆ సలహా మేరకు ఈ రిక్రూట్మెంట్ ప్రక్రియలో రెండవ దశను వెంటనే కొనసాగించాలని నిర్ణయం తీసుకుందన్నారు.

దీనికి సంబంధించి రెండవ దశ అప్లికేషన్ ఫారం నింపడానికి, భర్తీ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు వెబ్సైట్ లో పొందుపరుస్తామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. రెండవ దశలో ఉత్తీర్ణులైన వారికి మూడవ దశ ప్రధాన పరీక్ష జరుగుతుందని హోం శాఖ మంత్రి తెలిపారు.

# విశాఖలో మసాజ్ కేంద్రాలపై దాడులు



● సంచలన విషయాలు వెలుగులోకి

విశాఖ: 'స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో మసాజ్ కేంద్రాలు (స్పా) ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటయ్యాయి. మసాజ్‌తో పాటు ఇక్కడ అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాలు, అక్రమ రవాణా, ఇతర అసాంఘిక చర్యల నిరోధంపై పోలీసులు దృష్టి సారించారు. దాదాపు 200 మంది సిబ్బందితో విశాఖలోని మసాజ్ కేంద్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. 2 గంటల పాటు సాగిన తనిఖీల్లో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పోలీసు అధికారులు పాల్గొన్నారు. తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్టు సమాచారం.

# గ్రీవెన్స్‌ను జీరో స్థాయికి తీసుకురావాలి

● ప్రజలను పదే పదే ప్రభుత్వ కార్యాలయాలకు తిప్పుకోవద్దు ● ఈ నెల చివరి నాటికి ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ పూర్తి చేయాలి ● చట్టవిరుద్ధంగా చేసిన ఫ్రీ హోల్డ్ భూములపై న్యాయ సలహా ● పొలాలతోపాటు ఇళ్లకు కూడా జియో ట్యాగింగ్ ● త్వరలోనే రెవిన్యూ సదస్సులు ● కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి అనగాని సత్యప్రసాద్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: మంగళగిరి: తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజల సమర్పించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశించారు. తమ అర్జీల పరిష్యారం కోసం ప్రజలను పదే పదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని హితువు చెప్పారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే నిర్వహించాల్సిందేనని, అధికారులంతా ఆ రోజు కార్యాలయాల్లో ఉండాల్సిందేనని, వచ్చిన గ్రీవెన్స్ ను ప్రభావవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. పంటపొలాలకు మాత్రమే కాక త్వరలో ఇళ్లకు, ఇంటి స్థలాలకు కూడా జీయో ట్యాగింగ్ ను తీసుకువస్తామని చెప్పారు. దీని వల్ల భూముల యాజమాన్య హక్కులకు సంబంధించి వివాదాలు తగ్గుముఖం పట్టే అవకాశముందన్నారు. త్వరలోనే రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ఏక కాలంలో రెవిన్యూ సదస్సులతోపాటు రీసర్వేలో జరిగిన పొరపాట్లను కూడా సరి చేయాల్సి ఉందన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు కలెక్టర్లు తగిన గౌవరం ఇవ్వాలని, వారు తెచ్చిన సమస్యలను నిబంధనలకు అనుగణంగా ఉంటే వెంటనే పరిష్కరించాలని, పొలిటికల్ గవర్నెన్స్ కూడా చాలా ముఖ్యమని కలెక్టర్లకు సూచించారు. మంగళవారం మంగళగిరిలోని సీసీఎల్ఎ కార్యాయలంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మంత్రి అనగాని సత్యప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్ పి సిసోదియా, సీసీఎల్ఎ జయలక్ష్మీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజీ శేషగిరి బాబు, ఇతర రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్, రిజిస్టర్ కాబడ్డ ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్, ప్రజల నుండి వచ్చిన అర్జీలకు పరిష్కారం, సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్ అంశాలపై కలెక్టర్లతో మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు.

**ఈనెల చివరి నాటికి ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్‌పూర్తి :** ఈ నెల చివరి నాటికి ఫ్రీ హోల్డ్ భూములపై వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. గత ప్రభుత్వంలో అసైన్డ్ భూములను చట్ట విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసి కొంత మంది అనుచిత లబ్ది పొందారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూములను వెరిఫై చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. మొత్తం 13,59,804 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేయగా ఇప్పటి వరకు 4,17,640 ఎకరాలను వెరిఫై చేశారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా 91,739 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. అలాగే ఫ్రీ హోల్డ్ చేసిన భూముల్లో ఇప్పటి వరకు 25,230 ఎకరాలను రిజిస్టర్ చేయగా అందులో నిబంధనలకు విరుద్ధంగా 4,245 ఎకరాలను రిజిస్టర్ చేశారు. అయితే ఈనెల చివరి నాటికి ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ మొత్తం పూర్తవ్వాలని మంత్రి అనగాని ఆదేశాలు ఇచ్చారు. అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేసిన ఫ్రీహోల్డ్ భూములపై న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించారు.

**అర్జీల పరిష్కారంలో జాప్యంపై సిసోదియా సీరియస్ :** అర్జీల పరిష్కారంలో జరుగుతన్న జాప్యంపై రెవిన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోదియా సీరియస్ అయ్యారు. రెవిన్యూ శాఖా మంత్రి కార్యాలయం నుండి 1414 అర్జీలు పరిష్కారం కోసం కలెక్టర్లకు పంపగా కేవలం 16 అర్జీలకు మాత్రమే తిరిగి సమాధానం రావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంవో నుండి గానీ, రెవిన్యూ మంత్రి కార్యాయలం నుండి గానీ, తన కార్యాలయం నుండి గానీ వచ్చిన అర్జీలకు సరైన సమయంలో స్పందించకుంటే ఆయా కలెక్టర్లపై తగు చర్యలు ఉంటాయని అన్నారు. ఈ మూడు కార్యాలయాల నుండి ఏ సమాచారం అడిగినా వెనువెంటనే స్పందించాలని ఆదేశించారు.

# పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

● త్వరలో సిరిసిల్లలో సీఎంతో భారీ బహిరంగ సభ

● మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: పవర్ లూమ్ పరిశ్రమ పరిరక్షణకై అధ్యయనంలో భాగంగా అఖిల భారత పద్మశాలి సంఘం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం, సంయుక్తంగా మాజీ శాసనసభ్యులు తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్రి అనిల్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్లలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో సిరిసిల్ల పవర్లూమ్ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చింది కావున రాజకీయ, ఆర్థిక వనరుల్లో వాటా సాధించుకుందామని చెప్పారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విధంగా ఏ జాతి అయితే రాజ్యాధికారంలో వాటా లేకపోతే ఆ జాతి అంతరించిపోతుందని ఆనాడే చెప్పాడని తెలిపారు అందుకే తక్షణం మనం ఏకమై మన హక్కుల సాధించుకోవాలని కోరారు. త్యాగం అంటే కొండ లక్ష్మణ్ బాపూజీ అని ఆ కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులం మనం తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా పోరాడిన ఏకైక వ్యక్తి మన బాపూజీ అని కొనియాడారు పది సంవత్సరాలు పరిపాలించిన స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ పది నెలలు కూడా కానీ ప్రభుత్వంపై కార్మికుల ఆత్మహత్యలపై ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. పవర్లూమ్ కార్మిక సంఘాలు మరియు కార్మికులు ఇచ్చిన వినతి పత్రాలలోని అన్ని అంశాలన తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత బకాయిలు సిరిసిల్లకు 225 కోట్ల రూపాయలు విడుదల చేసిందని అంతేకాకుండా కోటి 25 లక్షల మీటర్ల చీరల తయారీ ఆర్డర్ను ఇవ్వనున్నట్లు స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు ఈ కార్యక్రమానికి తాటిపాముల దామోదర్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం సెక్రెటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచందర్ రావు, అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, పద్మశాలి సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు గోలి వెంకటరమణ, సంగీతం శ్రీనివాస్, టీపీసీసీ చేనేత సెల్ అధ్యక్షులు గూడూరి శ్రీనివాస్, పద్మశాలి సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్, టి పి పి ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిక్కా వెంకటేశ్వర్లు, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్, టీపీసీసి సెక్రెటరీ భోగ జగదీష్, పాలిస్టర్ మరియు కాటన్ వస్త్ర ఉత్పత్తి దారుల అధ్యక్షులు ఆడెపు భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, చింతకింది శ్రీధర్ బింగి వైకుంఠం, వన్నాల సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌పై ఈటల ఫైర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః నగరంలోని ఇందిరాపార్క్ వద్ద 24 గంటలుగా బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ నిరంతర దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల మాట్లాడుతూ.. "మాట వినని వాడు సైకో అవుతాడు.. ప్రజలను ఏడిపించి .. సంతోషించే వాడు శాడిస్ట్ అవుతాడు" అంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ తాట తీసే శక్తి ప్రజలకు, రైతులకు ఉంటుందన్నారు. ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. "మీ అంతరాత్మ సాక్షిగా ఏది అనిపిస్తే అది చెప్పండి. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన చిలుక పలుకులు మాట్లాడితే మీ గౌరవం పోతుంది" మంత్రి తుమ్మలను ఉద్దేశించి హితవుపలికారు. ప్రభుత్వం ఇస్తా అన్న 2 లక్షల రూపాయలు రైతుల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బొందపెడతారన్నారు. రెండు మూడు రోజుల్లో రింగ్ రోడ్డు వద్ద ధర్నా చేస్తామన్నారు. సాక్షాత్తు హైకోర్టు హైడ్రాపై మొట్టికాయలు వేసిందని.. అవి వేసింది హైడ్రాపై కాదు నేరుగా సీఎం రేవంత్ రెడ్డికి వేసిందంటూ వ్యాఖ్యలు చేశారు. "కోర్టు వ్యాఖ్యలతో అయినా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న. ప్రజలు నీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం" అంటూ ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. మరోవైపు బీజేపీ నేతల దీక్షకు ఆపార్టీ ఎంపీ ధర్మపురి అరవింద్ మద్దతు తెలిపారు. మంగళవారం ఉదయం ఇందరాపార్క్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై హాట్ కామెంట్స్ చేశారు. బీజేపీ దీక్షకు కాంగ్రెస్‌కు భయం పట్టుకుందన్నారు. దీక్షపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారని... ఆయనకు వయసు మీద పడిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రాంతీయ పంటలను విస్మరించారని.. ఇప్పుడు రేవంత్ అదే ఫాలో అవుతున్నారని మండిపడ్డారు. హైడ్రాపై హైకోర్ట్ మొట్టి కాయలు వేసిందన్నారు. "ముస్లింల ఇండ్లను ముట్టుకోలేదు. చుట్టాలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ పార్టీ నేతలను ముట్టుకోలేదు. కాంగ్రెస్ టార్గెట్ అంతా హిందువులే" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరించడం , బ్లాక్ మెయిల్ చేయడం రేవంత్ నైజమన్నారు. 22 పంటలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయం చేశారన్నారు. గుజరాత్ ఆదాయం మోదీ హయాంలో ఎంత పెరిగిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పైసలు ఎలా సంపాదించాలి అనే ధ్యాసనే ఉందంటూ విమర్శలు గుప్పించారు. లిక్కర్ స్కామ్‌లు చేసి జైళ్లల్లోకి వెళ్లారన్నారు. కేసీఆర్ శకం ముగిసిందని.. వచ్చే ఎన్నికల్లో ఉంటాడో పీకుతాడో తెలియదంటూ కామెంట్స్ చేశారు. కేటీఆర్, కవితల మోసం చూసి ఎవ్వరూ కూడా ఓటు వేయరన్నారు. "మొన్నటి వరకు ముసలోడు కేసీఆర్ ఉండే ఇప్పుడు ఆయన వయస్సు 74. ఇక ఇతనితో ఏం కాదు" అంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# బిఆర్ఎస్ నేతల దిష్టిబొమ్మల దహనం

● మంత్రి కొండా సురేఖపై అభ్యంతరకర పోస్టులను నిరసిస్తూ

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో

● కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావుల దిష్టిబొమ్మలు దహనం



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రాష్ట్ర దేవాదాశాఖ మంత్రివర్యులు కొండా సురేఖ పై బిఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం లికూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోలి కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావుల దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. లికూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డిలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు అక్కడికి చేరుకొని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు కేటీఆర్, టి. హరీష్ రావుల దిష్టిబొమ్మలు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లిశేరి సతీష్ రెడ్డిలి తో పాటు మహిళా నేతలు మాట్లాడుతూ తెలంగాణ బీసీ ఆడబిడ్డ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ కు రఘునందన్ రావు (బీజేపీ ఎంపీ మెదక్ )మెడలో దండ వేశాడని కళ్యాణ్ లక్ష్మి డబ్బులు ఇచ్చారా అని ఎగతాళి చేసి అవమానించిన కేటీఆర్, హరీష్ రావు దిష్టిబొమ్మల దహన సంస్కారం చేసినట్లు తెలిపారు. అంతేగాక వారికి ప్రజలు రాజకీయ కోరికట్టిన బుద్ధి రాలేదని, అందుకే వారికి రాజకీయ సంతాపం తెలిపినట్లు తెలిపారు. తెలంగాణ బడుగు బలహీనవర్గాల జరిగిన మహిళా అవమానానికి మహిళలు టిఆర్ఎస్ నేతలను చెప్పుతో కొట్టే పరిస్థితి వచ్చిందన్నారు. కెసిఆర్, హరీష్ రావు కేటీఆర్ లు బడుగు బలహీన వర్గాల ఆగ్రహానికి గురి కావద్దని హెచ్చరించారు. మహిళల గురించి బలుపు మాటలు మాట్లాడి ఓడిపోవడం జరిగింది ఓడిపోయిన సిగ్గు శరం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫణింద్ర, రేష్మ, ప్రవీణ్ కుమార్, మేకల మైకల్, లక్ష్మీనారాయణ, నల్లికాంత్, రాజ ముదిరాజ్, శ్రీకాంత్ గుప్తా, శ్రీధర్ చారి, సోను, సతీష్, మహిళా నాయకురాలు సంధ్య , పొన్నం రజిత, జోజమ్మ, మారుతి, యమునా,సుందరి, విజయలక్ష్మి, మమత, రమ్య పాల్గొన్నారు.



# కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుంది

**బీఆర్ఎస్‌పై మైనంపల్లి సంచలన ఆరోపణలు**

తెలంగాణ బ్యూరోప్రతినిధిః కేసీఆర్ కుటుంబం తెలంగాణను దోచుకుందని కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు సంచలన ఆరోపణలు చేశారు. స్టాండర్డ్ మీడియాను మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లు భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ఆర్.అండ్.ఆర్ కాలనీలోని మల్లన్న సాగర్ ముంపు బాధితులను మైనంపల్లి హనుమంతరావు, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్‌లో మూసి పక్కన ఉన్న పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముకేష్ అంబానీ తలుచుకుంటే మధ్యతరగతి వారు తీసుకున్న లోన్లు మాఫీ చేయొచ్చని అన్నారు. "హరీష్‌రావు, , కేటీఆర్‌లకు గజ్వేల్ నుంచి హెచ్చరిస్తున్నా ఏ ఒక్క ప్రాణం పోయినా మీరే బాధ్యత వహించాలి. ఏ ఒక్కరూ మరణించినా సహించేది లేదు. మల్లన్న సాగర్‌లో పోయినా ఇళ్లలో రూ. 30 లక్షల మార్కెట్ విలువకు రూ.5 లక్షల ఇచ్చారు. రైతుబంధు పేరుతో ఇటు ఇచ్చి ఫర్టిలైజర్ రూపంలో లాక్కుంటారు. ఫాం హౌస్‌కు రోడ్డు వేస్తే ఒక ఊరు మొత్తం పోయింది. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలు కడితే నిర్ధాక్షిణ్యంగా కూల్చేస్తామని అప్పుడు కేసీఆర్ అన్నాడు. మూసీ నది శుభ్రం చేయడం వల్ల ఎంతో లాభం ఉంది. దీనివల్ల నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రజలను అవసరమైతే వారిని ఆదుకుంటా. హరీష్‌రావు, కేటీఆర్ మీరు పేద ప్రజలను అండగా ఉంటారా" అని మైనంపల్లి హనుమంతరావు అడిగారు. "కేసీఆర్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు రూ. 50 కోట్లు బ్లాక్ మెయిల్ చేశాడు. వేల కోట్ల రూపాయలు కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు వాడారు. వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ఆపారు. అవసరమైతే ఆల్ పార్టీ మీటింగ్ పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సలహాలు ఇవ్వాలి. హైదరాబాద్‌లో నష్ట పోయిన వారికి అన్ని పార్టీల సహకారంతో నిర్వాసితులకు కావలసిన నష్ట పరిహారాన్ని అందజేస్తాం. హరీష్‌రావు రెండు రోజుల్లో హాసీఫ్‌నగర్‌లో ఉన్న నీ ఫాం హౌస్‌కు వస్తున్నా. చెరువులో నీ ఫాం హౌస్‌ను కట్టుకున్నావ్. వరదలు వచ్చినప్పుడు 24 గంటలు నీళ్లలో ఉన్నా. మీరేమో ఫాం హౌస్ కోసం ఊర్లకు ఊర్లు కూలుస్తారు. హైడ్రా విషయంలో బీజేపీతో సహా అన్ని పార్టీలు సహకరించాలి. విజయవాడ మాదిరిగా హైదరాబాద్ కాకూడదు. కేసీఆర్ ఫాం హౌస్ నుంచి, షాద్ నగర్ వద్ద ఉన్న హరీష్ రావు ఉన్న 70 ఎకరాల్లో నుంచి ఆర్ ఆర్ ఆర్‌కు రోడ్డు పోవాలి" అని మైనంపల్లి హనుమంతరావు వార్నింగ్ ఇచ్చారు.

# ఆడబిడ్డల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం

● రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో ఆడవారిపై అగాయిత్యాలు పెరుగుతున్న తరుణంలో ఆడపిల్లల నుండి వృద్ధురాలి వరకు మహిళా లోకానికి ఆణువంతు కుడా రక్షణ లేదని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో శుక్రవారం సాయం త్రం 21 యేండ్ల మొహమ్మద్ షరీఫ్ అనే కామాందుడు అభం శుభం తెలియని 10 సంవత్సరాల మైనర్ బాలిక పైన అమాను షంగా అత్యాచారం చేసిన ఘటనపై లిబిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డిలి గారు బాధిత కుటుంబ సభ్యుల్ని సిద్దిపేట పోలీస్ స్టేషన్ లో కలిసి వారికి మద్దతుగా బీజేపీ ఉంటుందని, నిందుతుడికి ఉరి శిక్ష పడేవరకు పోరాడుతామని, జాతీయ మానవ హక్కుల కమిషన్ కి ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. సిద్దిపేట జిల్లా ఇంచార్జిగా ఉన్న మంత్రి కొండా సురేఖ సంఘటన జరిన తర్వాత సిద్దిపేట లో పర్యటించారు కానీ బాధిత కుటుంబాన్ని పరామర్శించే సమయం, తీరిక దొరకలేదా అని ప్రశ్నిస్తూ సిద్దిపేట జిల్లా నా అడ్డా అని చెప్పుకునే హరీష్ రావు హైడ్రా మీద చర్చలకు, అపో సిషన్ల మీద ప్రెషమీట్ లకు, లిక్కర్ కేసులో కవిత కోసం ఢిల్లీకిపోయే సమయం ఉంటుంది కాని తమ ఇలాకాలో ఆడబిడ్డలపై జరుగుతున్న అకృత్యలా గురించి నోరుమిదపకపోవడం సిగ్గుచేటు అని శిల్పారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మరో 2 రోజుల పాటు వర్షాలు

**వాతావరణ కేంద్రం హెచ్చరిక**



హైదరాబాద్, తెలంగాణ బ్యూరోః తెలంగాణలో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. కొమరిన్ ప్రాంతంలోనున్న ఉపరితల ఆవర్తనం ఉత్తర ఇంటీరియర్ కర్నాటక వరకు తమిళనాడు మీదుగా ఉన్న సగటు సముద్రమట్టానికి 0.9 ఇలోమీటర్ల వరకు విస్తరించి ఉందని పేర్కొంది. మంగళవారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కరుస్తాయని చెప్పింది. బుధవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# మంత్రి సురేఖకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి


● సిరిసిల్లలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన బీసీ నాయకులు ● బీసీ రాజ్యాధికార సమితి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి, బీసీ మహిళ అయిన కొండా సురేఖపై బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం ట్రోలింగ్ ను తప్పుపడుతూ సిరిసిల్లలో బీసీ రాజ్యాధికార సమితి ఆందోళన చేపట్టింది. సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. కేటీఆర్ కు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. బీసీ మహిళ అయిన ఆడబిడ్డ పట్ల అనుచితంగా అమర్యాదగా ట్రోల్ చేయడాన్ని దాసు సురేష్ తీవ్రంగా ఖండించారు. "బీసీ మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే ఇకపై సహించబోం.. నీకు రాజకీయ భిక్షపెట్టిన పద్మశాలి ఆడబిడ్డని అవమానిస్తావా..?" అని ప్రశ్నించారు.

కేటీఆర్ ను రాజకీయంగా బొందపెట్టే రోజులు ఎంతో దూరంలో లేవని చాలెంజ్ చేశారు. బీసీ మహిళ అయిన సురేఖపై ట్రోలింగ్ చేయడం అంటే యావత్ మహిళలను అవమానించినట్లేనని దాసు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కొండా సురేఖను బీఆర్ఎస్ సోషల్ మీడియా అవమానిండాన్ని... బీసీ మహిళలతో పాటు, చేనేత మహిళా కార్మికుల ఓట్లతో గెలిచిన కేటీఆర్ తీవ్రంగా ఖండించాలని కోరారు. ఇప్పటికైనా కేటీఆర్.. కొండా సురేఖకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా చేనేత మహిళా కార్మికులతో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో చేనేత మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీసీ రాజ్యాధికార సమితి సిరిసిల్ల ఇంచార్జ్ , ఉమ్మడి కరీం నగర్ ప్రధాన కార్యదర్శి గోనె ఎల్లప్ప నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు వెలుముల స్వరూప , కాముని వనిత, సామల రోజా, అన్నల్దాస్ భాను , నల్ల శ్రావణ్ కుమార్ ,పోకల సాయికుమార్ , మంగ ప్రశాంత్ , కొక్కుల రాజు , బచ్చు ప్రసాద్ , చౌదారపు రాజు , వంగరి దత్తు , గాజుల సాగర్ రెబ్బ శ్రీనివాస్‌లతోపాటు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సంపాదకీయం

editpage@suryaa.com


బ్రిటిష్ వారి ద్రాస్య శృంఖలాల నుంచి భారతదేశ ప్రజానీకానికి బంధ విముక్తులు గావించిన,స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించిన స్ఫూర్తి ప్రదాత,'హింస వద్దు – అహింస ముద్దు ' అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి,శక్తి మన జాతిపిత మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీజీ గారు. అశేష భారతదేశ ప్రజానీకంచే బాపూజీ గా పిలువబడే గాంధీజీ గారి 156 వ జయంతిని పురస్కరించుకొని భారతదేశానికి ఆయన అందించిన అమూల్య,అసాధారణ,వెలకట్టలేని సేవలను స్మరించుకోవాల్సిన గురుతర బాధ్యత ప్రతి భారతీయుడిపై ఎంతైనా వుంది. ఎందుకంటే మన భారతవాణిపై అర్ధరాత్రి

## మహోన్నత వ్యక్తి,శక్తి జాతిపిత బాపూజీ

స్త్రీలు స్వేచ్ఛగా సంచరించినప్పుడే మన భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించినట్లు అని చాటి చెప్పిన గొప్ప దార్శనికుడు,అణువణువున దేశభక్తిని తనలో ఇముడ్చుకున్న నిస్వార్థ వ్యక్తి మన ప్రియతమ స్వాతంత్ర్య సమర యోధుడు మహాత్మాగాంధీ.జగడాలు,ఘర్షణల కంటే సామరస్య పూరితమైన వాతావరణం గొప్పదని చాటి చెప్పిన మహానుభావుడు మన జాతిపిత.ప్రతి ఒక్క భారతీయుడు కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం,క్రిస్టియన్ బాయ్ బాయ్ అంటూ స్నేహపూరితమైన వాతావరణంలో జీవించాలని చాలా గొప్ప సందేశాన్ని ఇచ్చారు గాంధీజీ. అంతేకాదు ఆయన అనుసరించిన శాంతియుత పంథా అంటే ' పరిగెత్తి పాలు తాగేకన్నా నిలబడి నీళ్లు తాగాలనే ' ఆయన అభిలాష,ఇంకా చెప్పాలంటే ఓర్పు,సహన శక్తి,మనో నిబ్బరాన్ని మనం గనుక అలవరచుకోగలిగితే కొండల్ని సైతం పిండి చేయవచ్చు,అసాధ్యాల్ని సైతం సుసాధ్యం చేయవచ్చు అనే నీతి సూత్రాన్ని కేవలం మాటలతో చెప్పడమే కాదు చేతలతో చేసి చూపించిన మహానుభావుడు,యావత్ జాతి మెచ్చిన దార్శనీకుడు,కోట్లాది మంది భారతదేశ ప్రజల హృదయాల్లో కొలువై వున్న దేవుడు లాంటి వారు ఈ మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీజీ గారు అనే మాట సత్య దూరం కాదు.అందుకే పూజ్యనీయులు బాపూజీ గారు మన ముందు లేకపోయినా కోట్లాది మంది భారతదేశ ప్రజల మనస్సుల్లో ఇప్పటికి అమరుడే, ఎందుకంటే ఆయన నడిచిన బాట,ఎంచుకున్న సిద్ధాంతాలు సదా అనుసరణీయమే, మేలుకొలుపు వంటివే అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. ఏదిఏమైనా అలాంటి మహోన్నతమైన, సంస్కారవంతుడైన, విశాల స్వభా వం మెండుగా గల బాపూజీ గారి అడుగుజాడల్లో నడిచి,ఆయన సిద్ధాంతాలను,ఆశయాలను దేశవ్యాప్తంగా అమలు పరిచేలా మన నాయకులు, పాలకులు వ్యవహరిస్తే అది మన భారతదేశ ప్రగతికి,అశేష ప్రజల అభివృద్ధికి, అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుంది అనే మాట అక్షర సత్యం.ఏమైన ఈ ప్రత్యేక దినాన,సందర్భాన కోట్లాది మంది భారతదేశ ప్రజానీకం యొక్క సుఖసంతోషాల కోసం తన విలువైన ప్రాణాలను సైతం త్యాగం చేసిన గొప్ప మానవతావాది అయినా బాపూజీ గారి పవిత్ర ఆత్మ కు ఆ నింగిలో శాంతి చేకూరాలని ప్రతి భారతీ యుడు మనసా,వాచ,కర్మణా, హృదయపూర్వకంగా కోరుకో వాల్సిన అవశ్యకత,అవసరత,మన ఆశేష భారతదేశ ప్రజల భుజస్కందాలపై ఎంతైనా వుంది. అమర్ రహే అమర్ రహే జాతిపిత మహాత్మాగాంధీజీ!జైహింద్! మేరా భారత్ మహాన్!

# బీసీలపై ఎన్నాళ్లీ కపట నాటకాలు?

● కులగణన పై బీజేపీ, కాంగ్రెస్ కుటిల రాగాలు ● స్థానిక సంస్థల రిజర్వేషన్ల పై బీఆరెఎస్ గురివింద గింజ తీరు
● కలేకర్ కమిషన్ నుంచి కామారెడ్డి డిక్లరేషన్ వరకు పార్టీ లవి అన్ని మోసాలే
● ఈడబ్ల్యూఎస్, మహిళా బిల్లులతో బీసీలను బుల్డోజు చేసిన బిజెపి



**చామకూర రాజు**
**9866663153**

"ఒక నక్క ప్రమాణ స్వీకారం చేసిందట ఇంకెవరిని మోసగించనని, ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిందట తోటి జంతువుల్ని సంహరించబోనని..ఈ కట్టుకథ విని గొర్రెలు ఇంకా పుర్రెలూపుతూనే ఉన్నాయి...!" అన్నాడు ఆనాడు తెలంగాణ ప్రముఖ కవి' అలిశెట్టి ప్రభాకర్' గత ఏడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ ,బీజేపీలు బీసీలను మోసం, చేస్తూ వస్తున్నాయి. ఈ రెండు రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు ప్రతి సారి బీసీల కు ఇచ్చే హామీలకు బిసి లు గొర్రెల్లాగా పుర్రెలు ఊపుతూ వోట్లు వేస్తూ, ఈ రెండు పార్టీలను గద్దెనెక్కిస్తూనే ఉన్నారు. ఎన్నికల తర్వాత గద్దెనెక్కిన ఇరు పార్టీలు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తమ రాజకీయ దుర్బిద్దినిచాటుకోవడంలో పోటీ పడుతున్నారు.ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ రాజ్యాంగం ప్రకారం వర్గీకరించబడిన బీసీలు అంటే (ఎస్సి, ఎస్టీ, ఓబీసీలు) వెనుకబడిన తరగతులు అతిపెద్ద సామాజిక సమూహం. అందులో ఎస్. సి.ఎస్.టి లో పోను మిగతా సమూహంబిసీలే. ఈ వోట్లే భారతదేశంలో పాలక, ప్రతిపక్ష పార్టీలను నిర్ణయిస్తాయి. ఇంత నిర్ణయాత్మక సంఖ్య గలబిసిల పట్ల కాంగ్రెస్ బిజెపి పార్టీ లు అనుసరిస్తున్న విధానాలు పరిశీలించినట్లయితే పూర్తిగా వంచనా చరిత్ర కనిపిస్తోంది. . కాంగ్రెస్ నాడు రాజ్యాంగ రచన సమయంలోను, కాక కాలేకర్ ,మండల్ కమిషన్ సందర్భాలలో జవహర్ లాల్, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, నేటి రాహుల్ గాంధీ వరకు నక్క వినయాలు ప్రదర్శిస్తూ మోసం చేస్తూనే ఉన్నారు. హిందూ మతం పునాదిగా, సిద్ధాంత భూమికగా అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ సైతం హిందూమతంలోని అత్యధిక శాతం ఉన్న బీసీలను నాడు రాముని రథయాత్ర పేరిట నేడు వైరుధ్యాలు, వైశమ్యాల పేరిట దగా చేస్తూనే ఉంది. మొత్తంగా ఇప్పటివరకు కాంగ్రెస్ బిజెపిల రాజకీయ చరిత్ర సమస్తం బీసీలను నయవంచనకు గురిచేస్తు బీసీలను మోసం చేయడమే ఈ రెండు జాతీయ పార్టీల రాజనీతిగా మారిపోయింది. రాజ్యాంగ రచన సమయంలో బీసీలకు జరిగిన మోసం ఫలితంగా ఏడున్నర దశాబ్దాలుగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు దక్కడం లేదు. రాజకీయ, సామాజిక దోపిడీకి గురవుతూనే ఉన్నారు. రాజ్యాంగబద్ధ కట్టుదిట్టమైన రక్షణ, ప్రోత్సహకాలు ప్రత్యేక ప్రివిలేజీలు ఏమి లేకపోవడంతో అలుసుగా తీసుకుంటున్న ఈ రెండు పార్టీలు అటు కేంద్రంలో ఇటు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ లు ఇస్తూ ప్రతిసారి మోసం చేస్తూనే వస్తున్నాయి. అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుకోనివ్వకుండా అడ్డుకోవడం మాత్రమే కాదు, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్ర అణిచివేతకు గురిచేస్తున్నారు. బీసీలు వోట్ బ్యాంకుగా ఏకీకృతం కాకపోవడంతో దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ట్రాల్లో అన్యాయం జరుగుతుందన్నది జగద్విదితం. కొంత సామాజిక న్యాయం, సంక్షేమం ఉందంటే కేవలం బీసీల నాయకత్వంలో ఉన్న పార్టీలు గతంలో పరిపాలించిన, ప్రస్తుతంపరిపాలిస్తున్న తమిళ నాడు.బీహార్. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోనే సాధ్యమైంది. కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో గతంలో బీసీ ల అంశాలపై వ్యవహరించిన తీరును పరిశీలించినట్లయితే అంబేద్కర్ రాజీనామా ఒత్తిడి తో వేసిన కాకా కలేకర్ కమిషన్ నివేదిక ను నాటి ప్రధాని నెహ్రూ తొక్కి వేయగా, మండల్ కమిషన్ ను ఇందిరా గాంధీ కోల్డ్ స్టోరేజ్ లో పెట్టింది. ఇదే మండల్ కమిషన్ అమలు ప్రకటన సమయంలో నాటి ప్రధాని వీపి సింగ్ పై ప్రతి పక్ష హోదా లో ఉన్న రాజీవ్ గాంధీ కుల ప్రాతిపదికన విభజిస్తున్నరంటూ పెద్ద ఎత్తున విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా , రాష్ట్రం లో సమగ్ర కులగణన చేపట్టాలని బీసీలు పెద్ద యెత్తున ఉద్యమం చేస్తున్నారు. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల లో కనీవినీ ఎరుగని రీతిలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం లో బీసీ లకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీసీ సమాజం బలమైన ఉద్యమం చేస్తోంది. బిసి ల ప్రధాన డిమాండ్ లలో ఒకటి సమగ్ర కులగణన. ఈ అంశం పట్ల కాంగ్రెస్ బిజెపిల వ్యవహారం పరిశీలించి నట్లైతే వీరి భాగోతం బట్టబయలు అవుతోంది. 2007 సంవత్సరం లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోని యూపీఏ కూటమి అధికారంలో ఉండగా ప్రతిపక్ష పార్టీహోదా లో కులగణన చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. తర్వాత 2010 లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని భాగస్వామ్య పక్షాలు, ఎన్డీఏ లోని బిజెపి ఇతర పార్టీలన్నీ కలిసి కులగణన చేయాలని ఏకాభిప్రాయం కూడా వ్యక్తం చేశాయి. ఆ తర్వాత యుపిఏ కేంద్ర మంత్రి గా ఉన్న వీరప్పమొయిలీ ప్రకటన చేయగా మరుసటి రోజే మరోకేంద్ర మంత్రి 2011 జనాభా లెక్కలతో కులగణన చేయబోమని. ప్రత్యేక కులాల సోషియో ఎకానమీ సర్వే చేస్తామని ప్రకటన చేశారు. అటు తర్వాత ఈ సర్వే చేసినా అందులో తప్పులు ఉన్నాయని తప్పు దారి పట్టించి లెక్క లు వెల్లడించలేదు తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి. 2014 తర్వాత బీజేపీ నాయకత్వం లోని ఎన్డీయే కూడా యూ టర్న్ తీసుకుని అదే బాటలో నడిచింది.గతంలో 2018 హోమ్ మంత్రి హోదాలో రాజ్ నాథ్ సింగ్ కులగణన చేస్తామని పార్లమెంట్ లో ప్రకటన చేసిన బీజేపీ తాము చేయబోమని సుప్రీంకోర్టు లో అఫిడవిట్ దాఖలు చేశారు. పార్లమెంట్ సాక్షిగా ప్రతి పక్షం లో హామీ ఇచ్చి అధికార పక్షంలో కి రాగానే కులగణన చేపట్టకుండా బీసీ లను మోసం చేస్తున్నారు.జాతీయస్థాయిలో కుల గణన అంశంలో గతంలో కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం బిజెపి జాతీయ స్థాయిలో చేస్తున్న మోసమే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేసే ప్రయత్నం లో ఉంది. ఢిల్లీలో రాహుల్ గాంధీ పదేపదే కులగణన అస్త్రం ప్రయోగిస్తూ భారతీయ జనతా పార్టీ పై విమర్శల దాడి పెంచారు ఇది గమనించిన కొంత మేరకు బిజెపి ఒక మెట్టు దిగి దాని మాతృక సంస్థ ఐన ఆర్ఎస్ఎస్ ఒక ప్రకటన కూడా విడుదల చేసింది .కులం అనే అంశం సామాజిక అంశం మాత్రమే కావాలని, రాజకీయ అంశం కాకూడదని ఒక మెలిక పెట్టింది . ప్రస్తుతం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ప్రయోగిస్తున్న కులగణన అంశం పై ఆర్ఎస్ఎస్ ఒక మెట్టు దిగడానికి ప్రధాన కారణం హర్యానా మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అసెంబ్లీల ఎన్నికలు జరుగుతుండడమే. బిజెపి హర్యానాలో గతంలో కులగణన చేస్తామని ప్రకటించి ప్రజలు కోరుకోవడంలేదు కాబట్టి చేయబోమని అక్కడ మాజీ ముఖ్యమంత్రి మనోహర్లాల్ ఖట్టర్ ప్రకటించారు .మహారాష్ట్రలో కులగణన అంశం కోర్టు మెట్ల ఎక్కింది జాతీయస్థాయిలో కులగణన రాగం తీస్తున్న రాహుల్ గాంధీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే చేస్తా అన్న తెలంగాణలో హామీ అమలు పట్ల చిత్తశుద్ధి చూపించడం లేదు. కులగణన చేపట్టాలని ,స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కామారెడ్డి డిక్లరేషన్ పూర్తిగా అమలు చేయాలని కోరుతూ బత్తుల సిద్దేశ్వర్ పటేల్ జక్కని సంజయ్ నేత ,చాపర్తి కుమార్ గాడ్గేలు ఇటీవల ఆమరణ నిరాహార దీక్ష చేశారు .12 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు . గత ఏడున్నర దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పూర్తిగా రెడ్ల గుత్తాధిపత్యంలో కొనసాగించి రాష్ట్రంలో సహజంగా ఆధిపత్య కులమైన రెడ్ల చేతులు ఉన్న కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీని తమ కుల ఆధిపత్య రాజకీయ అవసరాల కోసం కులగణన చేయనీయకపోతే భవిష్యత్తు లో ఆ పార్టీ కి గట్టి బుద్ధి చెప్పడానికి బీసీ లు సిద్ధమౌతున్నారు. తెలంగాణ పిసిసి అధ్యక్షులుగా బిసి నేతమహేష్ కుమార్ గౌడ్ కు పగ్గాలు ఇచ్చి సమగ్ర కులగణన అంశాన్ని పక్కదారి పట్టించి, కేవలం బీసీ కులాల లెక్కల వివరాలు బీసీ కమిషన్ ద్వారా ప్రకటన చేసే కుట్రపూరిత విధానంకు కాంగ్రెస్ పార్టీ తెరతీసింది. ఇది కేవలం బీసీ ల ఉద్యమం ను నీరు కార్చే కుటిల యత్నమే తప్ప వారి కోరిక నెరవేర్చే ఉద్దేశం ఆ పార్టీ కి లేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం లో ప్రతిపక్ష స్థానంలో ఉన్న బిఆరెస్ పదేళ్ల పాలనలోనూ బీసీలను పలు అంశాల్లోను పాతాళానికి తొక్కింది. ఇప్పుడు బీఆరెఎస్ పార్టీ గురివింద గింజ రీతిలో వ్యవహరిస్తోంది. బీఆరెఎస్ కంటే ముందు స్థానిక సంస్థల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించి ంది. ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు అర్హత గల అగ్ర కులాల జనాభా లెక్క ప్రకారం ఒకటి లేదా ఒకటి న్నర శాతం ఉంటే పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది.అధికారంలో ఉన్నప్పుడు తమిళ నాడు తరహా రిజర్వేషన్లు అంటూ హడావుడి చేసి ఉన్న రిజర్వేషన్లు తగ్గించి,బీసీ రిజర్వేషన్లు పరిశీలిస్తామంటూ మళ్లి ఇప్పుడు తమిళనాడు యాత్ర చేస్తున్నారు. కులగణన అంశంలో ఈ పలు సాకులు చూపించి అటు కాంగ్రెస్ బిజెపిలు గతంలో మాదిరిగా మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి .ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంత ..!అంటూ పదే పదే చెప్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కులగణన ను కోల్డ్ స్టోరేజ్ లో పెట్టేసింది..గతంలో ముఖ్యమంత్రి గా సిద్దిరామయ్య ఉన్నప్పుడు కాతరాజు కమిషన్ వేసి కులగణన చేయించారు. కానీ తీరా ఎన్నికల ముందు నివేదిక సమర్పించగా అప్పుడు కులగణన లెక్కలు విడుదల చేయలేదు..తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం వేసిన జయప్రకాష్ హెగ్డే బీసీ కమిషన్ ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకే ఫిబ్రవరి 2024 న నివేదిక సమర్పించింది. ఇప్పటి వరకు వివరాలు బయటకు వెల్లడించలేదు.అక్కడి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పరిశ్రమల శాఖ మంత్రి ఎంబి పాటిల్ ఈ కులగణను బయట పెట్టొద్దంటూ ఒత్తిడి చేస్తున్నారు.దీంతో అక్కడి ప్రభుత్వము కుల గణన వివరాలు ప్రకటించడం లేదంటే వారికి. చిత్తశుద్ధి లేదని తేలిపోతుంది. గత మూడు సార్లు జరిగిన లోక్ సభ ఎన్నికల కు ముందు తాను బీసీ నని పదేపదే చెప్పుకున్న నరేంద్ర మోడీ అగ్ర కులాల కోసం ఆఘమేఘాల మీద పదిశాతంఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు తెచ్చారు. ఇన్నాళ్లు పెండింగ్ లో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లు తెచ్చి భవిష్యత్తు లో బీసీల ఆ కాస్త ఉన్న రాజకీయ అవకాశాలను బుల్డోజ్ చేసారు.

# కాశ్మీర్‌లో మోడీ హవా ఎంతవరకు?

● జమ్మూ కాశ్మీర్లో కాషాయ జెండా ఎగిరేనా? ● ఉగ్రవాద నిర్మూలన చర్యలసౌ తీవ్రప్రచారం ● తనదైన శైలిలో ఎదురుదాడి చేస్తున్న కాంగ్రెస్
● కొండలు లోయలు హిమ పాతాల నడుమ ఉగ్ర సంచారం ● బిజెపికి పట్టుమని పది సీట్లు కూడా రావంటున్న కొందరు

**శ్రిష్టి శేషగిరి**
**9290652632**

మోడి ప్రభావం జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ఉంటుందా? ఉంటే ఎంతవరకు? అని ఎంతో అని ఎంతో ఆసక్తిగా దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారు. మూడోసారి ముచ్చటగా గెలిచిన మోడీ ఈసారి ఎలాగైనా కాషాయ జెండా జమ్మూ కాశ్మీర్లో ఎగిరేయాలని చాలా పట్టుదలగా ఉన్నారు. అందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకపక్క కాంగ్రెస్ ని దీటుగా ఎదుర్కొంటూ మరోపక్క తనదైన శైలిలో ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. మోడీ చేపట్టిన ఉగ్రవాద నిర్మూలన చర్యలు జమ్మూ కాశ్మీర్ కి ఎంతగానో ఉపకరిస్తాయి.ఇండి లో అతిశయోక్తి లేదు. శాంతి సహనాలు శాంతి సామరస్యం కోసం ఎలాగైనా సరే జమ్మూ కాశ్మీర్ ను తమ ఆధీనంలోకి తీసుకోవాలని మోడీ తపిస్తున్నారు . అయితే ఈ స్థానం పై పట్టు కోసం కేవలం మోడీ కాదు కాంగ్రెస్ కూడా అంతే బలంగా ప్రయత్నిస్తుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఖర్గే యొక్క నిర్దేశంలో కాంగ్రెస్ కూడా తనదైన శైలిలో బిజెపికి ఎదురుదాడిగా నిలుస్తుంది. బిజెపి ప్రతికూల అంశాలను పదేపదే ఎత్తిచూపుతుంది కాంగ్రెస్. సర్జికల్ స్ట్రైక్ ఏకైక ఆయుధముగా బిజెపికి గొప్ప మద్దతు లభిస్తుందనుకోవచ్చు. కాశ్మీర్ అంటె చూసే వారికి అదో అందమైన ప్రదేశం. భూతల స్వర్గం. మంచు. కొండలు లోయలు హిమ పాతాలు. వగైరా వగైరా.కానీ దినికి మారో కోణం కూడా ఉంది. ఇది వివాదాల పుట్ట. ఉగ్రవాదుల అడ్డ. రహస్యాల గుట్ట. ఎన్నొ రక్తపాతాలకు రణ రంగాలకు తెర తీసిన చిట్టా. కాశ్మీర్ మాదంటే మాదని ఎన్నొ ఏళ్లుగా దాయాది దేశమైన పాకిస్తానుకు చైనా కు మనకు అనేక మార్లు యుద్దాలు జరిగాయి. ఎందరో దేశ సైనికులు ముష్కరుల దాడిలో ప్రాణ త్యాగం చేశారు. ఎందరో ముష్కరులను ఉగ్రవాదులకు భారత్ మట్టుబెట్టింది. ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఈ రాష్ట్రంలో తోలి సారి అసెంబ్లి ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ స్థానిక జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాంగ్గ్రెస్ మరియు కాంగ్రెస్ పార్టీతో జత కలిపి కూటమిగా ఏర్పడ్డారు. వీరి ధ్యేయం ఎలాగైనా సరే మోడీని ఓ డీంచాలి. అందుకు తగిన ప్రణాళికను వాళ్ళు రచించుకుంటున్నారు.. బిజెపికి పట్టుమని పది సీట్లు కూడా రావు. అని జమ్మూ కాశ్మీర్ పార్టీ అభ్యర్థి ఎద్దేవా వేశారు. సుస్థిరపాలనుకు శాంతి సహనాలకు అభివృద్ధికి మాకే పట్టం కట్టాలని మోడీ మరియు అమిత్ షా కాశ్మీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. 23 లక్షల జనాభా ఉన్న ఈ జమ్మూ కాశ్మీర్లో జరిగే ఎన్నికలు ఎంతో ఆసక్తిని లేపుతున్నాయి. భారీ అంచనాలతో 30 నుంచి 35 సీట్లు గెలుస్తామని అని భావిస్తున గులాం అహమద్ మీర్ గతంలో పేర్కొన్నారు. దిన్ని బట్టి అక్కడ వారి బలం ఎంతుందో అర్థం అవుతుంది. ఇక్కడ మోడి చరిష్మా నీ కుడా కాస్త పరిగణనలోకి తీసుకోవాలి. మూడో సారి ముచ్చటగా ప్రధాని పీఠం కైవసం చేసుకున్న మోడీ కి ఇప్పుడు తాజాగా జరిగే జమ్మూ కాశ్మీర్ అసెంబ్లి మూడో దశ ఎన్నికలు పెద్ద సవాల్ చేస్తున్నాయి. తన యావత్ శక్తి యుక్తులను బీజేపీ ఈ ఎన్నికల కు కర్చు చేస్తుంది.మతకల్లోలన్ని హింసని నీర్మూలించడమే ధ్యేయంగా బిజేపి కాశ్మీర్లో ముందుకు వెళ్తుంది. యూనియన్ టెరిటరీ నుండి రాష్ట్ర హోదా కలిగాక జరిగే ఈ ఎన్నికల్లో తామే మొదట అసెంబ్లిని



స్టాపిస్తామని ఎంతో దృఢ నిశ్యయంతో మోడీ ఉన్నారు. ప్రజలు కూడా తమ వెట్కపు ఉన్నారని వారు ఎంతో ఆసక్తిగా తమని గెలిపించేందుకు కృషీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం మిగతా రాష్ట్రాల నెలలు జరిగే ఎన్నికలు బిజెపికి అంత ప్రాముఖ్యం కాకపోయినా ఒక జమ్మూ కాశ్మీర్లో జరిగే ఈ ఎన్నికలే ఎంతో కీలకం ఆవశక్యం. అందుకారణం తరతరాలుగా కాశ్మీర్లో చెలరేగి హింసకాండ. కాశ్మీర్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న వివాదాలు విమర్శలు రాజకీయాలు వీటిని నిర్మూలించాలంటే జయించాలంటే అక్కడ బిజెపి లాంటి ఒక బలమైన పార్టీ కావాలి. మోడీ లాంటిది ఒక ధీరుడు అక్కడ మార్గం నిర్దేశం చేయాలి. అప్పుడే కశ్మీర్లో శాశ్వతంగా ఎన్నో సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. ముఖ్యంగా కాశ్మీర్ అంటేనే కొంత వరకు ఉద్రిక్తలకు ఘర్షణలకు మారుపేరుగా దేశంలో పేరు పోయింది. అటువంటి కాశ్మీర్లో మోడీ తన ప్రభావంతో తన చాణిక్య నీతితో రాజకీయ చతురతతో బిజెపి ని గెలిపిస్తే ఇక అన్ని సమస్యలకు పెద్ద ఉపశమనం లభించినట్లే.

# యుద్ధోన్మాది నెతన్యాహూను నిలువరించ లేరా?

● చేష్టలుడిగి చూస్తున్న ప్రపంచం ● సామ్రాజ్య విస్తరణా కాంక్ష తో అమెరికా ఆర్థిక తోడ్పాటు,
● నెతన్యాహు బలాన్ని పెంచిన మారణాయుధాల సరఫరా ● బంకర్లను ఛేదించి హెజ్బొల్లా అధినేత అసన్ నస్రల్లాను అంతం
● గత ఏడాది కాలంలో 41 వేల మందిని అంతం చేసిన ఇజ్రాయేల్

**లిడాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

ప్రపంచ దేశాల చేతకానితనాన్ని,కోరలు పీకిన ఐక్యరాజ్యసమితి బేలతనాన్ని ఆసరాగా చేసుకొని ఇజ్రాయేల్ ప్రధాని నెతన్యాహు కాలయముడిలా పశ్చిమాసియాపై విరుచుకు పడుతున్నాడు.ఇతనికి తోడు ప్రజాస్వామ్య ముసుగులో కొనసాగుతున్న మరో సామ్రాజ్య విస్తరణా కాంక్షగల దేశం అమెరికా ఆర్థిక తోడ్పాటు, మారణాయుధాల సరఫరా నెతన్యాహు బలాన్ని విపరీతంగా పెంచింది.
ఇప్పుడు పశ్చిమాసియాలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పాయి. గాజాపై యుద్ధాన్ని ప్రకటించి,బాంబుల వర్షం కురిపిస్తూ, వరస దాడులకు తెగబడుతూ గత సంవత్సర కాలంగా ఇజ్రాయేల్ ఆ ప్రాంతాన్ని మరుభూమిగా మార్చివేసింది. ఇజ్రాయిల్ ఇప్పుడు హెజ్బొల్లాపై దాడుల ను సాకుగా చూపి లేబనాన్ లో బాంబులతో విధ్వంసం సృష్టిస్తోంది. హమాస్ కు మద్దతు తెలిపినందుకు హెజ్బుల్లా ఉగ్రవాద సంస్థను అంతం చేందుకు పూనుకుంది.15 రోజుల కిందట తన సాంకేతిక పరిజ్ఞానంతో పేజర్, వాకీటాకీలను పేల్చివేసింది.ఈ చర్య వందలాదిమందిని హతమార్చింది. వేలాది మంది తీవ్ర గాయాలతో బాధ పడుతున్నారు.ఇప్పుడు ఇజ్రాయిల్ మూడు రోజుల క్రిందట అమెరికా అందించిన బాంబులను ఉపయోగించింది.ఇవి బలమైన బంకర్లను ఛేదించి హెజ్బొల్లా అధినేత అసన్ నస్రల్లాను అంతం చేసింది.ఆ మరుసటి రోజే మరో కీలక నేత నబిల్ కౌక్ ను కూడా హతమార్చింది.ఉగ్రవాద నేతలను హతమార్చే పేరుతో ఇజ్రాయిల్
...బీరుట్, సైదా,మరజాయిన్,టైర్, జహారాని తదితర నగరాలపై వైమానిక దాడులు జరిపి అపారమైన ఆస్తి, ప్రాణనష్టాలకు వడిగట్టింది.ఈ వరుస దాడులతో పశ్చిమాసియా పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది.ఇప్పటికే గత 15 రోజుల్లో లెబనాన్ పై ఇజ్రాయేల్ జరుపుతున్న దాడుల్లో 1000 మందికి పైగా చనిపోయారు. ఇక గత ఏడాది కాలంలో ఇజ్రాయేల్ 41 వేల మందిని అంతం చేసింది.అయినా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు యుద్ధకాంక్ష తీరలేదు. పశ్చిమాసియా అగ్నిగుండల్లా మారటానికి ఆయన అనుసరిస్తున్న విధానాలే కారణమని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు న్యూయార్క్ వచ్చిన నెతన్యాహు అక్కడ నుంచే నస్రల్లా హత్యకు తమ దళాలకు ఆదేశాలు ఇవ్వడం ఆయన పొగరుబోతు తనానికి నిదర్శనం.ఈ దారుణ హింసకు ఇకనైనా స్వస్తి పలకాలంటూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నా నెతన్యాహూ అసలు ఖాతరు చేయటం లేదు. ఇజ్రాయిల్ దుందొడుకు ధోరణి ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరుస్తోంది. హమాస్– ఇజ్రాయేల్ మధ్య పోరులో వెనక నుంచి ఆర్థిక సహాయం,ధారుణమైన ఆయుధాలు సమకూర్చి ఇజ్రాయేల్ ను ముందుకు తోసిందే అమెరికా. ఇప్పుడు తాజాగా బీరుట్ పై దాడులను అమెరికా సిగ్గులేకుండా సమర్థిస్తుంది. ఒకవైపు ఇజ్రాయేల్ హెజ్బొల్లా దళాలపై వైమానిక దళంతో బాంబులు కురిపిస్తుంటే, మరోవైపు సిరియాలో ఉన్న అమెరికా దళాలు వైమానిక దాడులు నిర్వహించి 37



మంది ఉగ్రవాదులను హతమార్చింది.
గాజా,పాలస్తీనా,హెజ్బొల్లా,లెబనాన్,ఇరాన్ ...ఇజ్రాయిల్ శత్రుత్వం ఈనాటిది కాదు. 40ఏళ్ళ క్రితం నుండే వాటిమధ్య నిప్పు రాజుకుంది. హెజ్బొల్లా ఇరాన్ అండదండలతో బలోపేతమైంది. ఇజ్రాయేల్ కు పెనుసవాల్ విసురుతుంది. అంతర్జాతీయంగా డ్రగ్స్ వ్యాపారంలో రాటు తేలింది. ఆర్థికంగా బలపడింది. మారుణాయుధాలను సమకూర్చుకుంది. మొదట లేబనాన్ కు మాత్రమే పరిమితమైన హెజ్బొల్లా ఉగ్రవాదుల గుంపు క్రమంగా తన కార్యకలాపాలను అనేక దేశాలకు విస్తరించింది.ముఖ్యంగా దక్షిణ అమెరికా దేశాలు హెజ్బొల్లాకు ఆర్థికంగా తోడ్పడుతున్నాయి. ఇప్పుడు హెజ్బొల్లా ఇజ్రాయేల్ తాజా దాడుల్లో కీలక నేతలను పోగొట్టుకుంది. తనకు మద్ధత్తుగా షాడో యూనిట్లను రంగంలోకి దించే అవకాశం ఉంది. హెజ్బొల్లా ప్రతీకారంతో రగిలిపోతుంది.దాని ఉగ్రవాద మూకలు అనేక దేశాల్లో విస్తరించి ఉన్నాయి. హెజ్బొల్లా కీలక నేతల నుండి ఆదేశాలు అందిన తక్షిణమే ఆయా దేశాల్లో నివసిస్తున్న ఇజ్రాయేల్ పోరులను హతమార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది.

**ఇరాన్ యుద్ధరంగంలోకి దిగితే రిబోయే పరిణామాలు:**

నస్రల్లా హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది.ఆ దేశం నేరుగా యుద్ధంలోకి దిగితే ప్రపంచ దేశాలకు చమురు సరఫరా ఆగిపోతుంది.ఇప్పటికే పశ్చిమాసియాలో పరిస్థితులు బాగా దిగజారాయి. దాని ప్రభావం చమురు మార్కెట్ల పైన పడింది.
హమాస్, హెజ్బొల్లా, హూతీలపై ఏకపక్షంగా దాడులు చేస్తున్న ఇజ్రాయేల్ ను కట్టడి చేసేందుకు చమరు సరఫరాకు కీలకమైన హర్మ్యాజ్ జలసంధిని మూసివేయాలని ఇరాన్ భావిస్తున్నట్టు తెలుస్తుంది.అదే గనుక జరుగుతే చమరు ధరలు ఆకాశాన్నంటడం ఖాయం. ఈ నేపథ్యంలో లేబనాన్ ను మరో గాజాలా మార్చకముందే. నెతన్యాహు నియంతను అదుపు చేసేందుకు ప్రపంచ దేశాల నేతలంతా ఉమ్మడిగా కృషి చేయాలి. లేకుంటే మూడో ప్రపంచ యుద్ధం తప్పదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలక తప్పదు.

## పూర్వపు వైభవం దిశగా భారత హాకీ క్రీడ!

మొన్నటికి మొన్న జరిగిన పారిస్ ఒలింపిక్స్ లో కాంస్య పతకం సాధించిన భారత హాకీ జట్టు మరోమారు ఛాంపియన్ ఆటతీరును కనబరచి వరుసగా రెండోసారి ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ ) విజేతగా నిలువడం ఎంతైనా హర్షణీయం. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఈ ఆసియా ఛాంపియన్స్ టోర్నీలో బరిలోకి దిగిన మన భారత హాకీ జట్టు తన హోదాకు తగినట్లుగానే ఈ టోర్నీ అధ్యంతం అత్యద్భుతంగా రాణించిన తీరుతెన్నులు ఒక్కసారి మనం పరిశీలించి చూస్తే ఖచ్చితంగా పూర్వపు వైభవం దిశగా మన భారత హాకీ క్రీడ ఓ వందే భారత్ ఎక్స్ప్రెస్ లాగా దూసుకుపోతున్నట్లుగా,కదంతొక్కుతున్న ట్లుగా అశేష భారత హాకీ క్రీడాభిమానులం అయిన మనందరికీ చాలా స్పష్టంగా విశదమవుతున్నది అనే మాట సత్య దూరం కాదు.ఇక ఈ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ ) ఫైనల్లో మాత్రం చైనా జట్టు నుంచి ఊహించని విధంగా ఓ గట్టి ప్రతిఘటన మన భారత హాకీ జట్టు సభ్యులకు ఎదురైంది.అయితే చావు తప్పి కన్ను లోట్టబోయినట్లుగా ఎట్టకేలకు డిఫెండర్ జుగ్ రాజ్ సింగ్ ఆఖరి క్వార్టర్ లోని 51 వ నిమిషంలో చేసిన ఏకైక ఫీల్డ్ గోల్ లో భారత హాకీ జట్టుకు విజయం తన హస్తగతమైంది. అదేమాదిరి ఈ టోర్నీ లీగ్ పోటీల విషయానికి వస్తే భారత హాకీ జట్టు వరుసగా 3 – 0 తేడాతో చైనా, 5 – 1 తేడాతో జపాన్, 6 – 1 తేడాతో మలేసియా,3 – 1 తేడాతో కొరియా, 2 – 1 తేడాతో పాకిస్తాన్ లను హర్మన్ ప్రీత్ సారథ్యంలోని భారత హాకీ జట్టు ఓడించడమే కాదు సెమిస్ లో అత్యంత పటిష్టమైన కోరియా జట్టును సైతం 4 – 1 తేడాతో మట్టికరిపించి మరీ టైటిల్ పోరులో నిలువడం అనేది నిజంగా మన భారత హాకీ జట్టు సభ్యుల ఓ స్ఫూరిదాయకమైన ఆటతీరుకు అద్దం పడుతున్నది అనే మాట అక్షర సత్యం.అయితే అన్నింటికి మించి తుది పోరులో మాత్రం చైనా డిఫెండర్లు భారత స్ట్రయికర్లను సమర్థంగా నిలువరించిన తీరు,భారత ఫార్వర్డ్ లైన్ కు గోడ కట్టినట్లుగా చైనా డిఫెండర్లు నిలిచిన తీరు చైనా జట్టు హాకీ ఆటగాళ్ల అద్భుతమైన ఆటతీరుకు ఓ కారణభూతంగా నిలిచింది అనడంలో ఎలాంటి అవాస్తవం లేదు.దీంతో ఈ టోర్నీలోనే అతి తక్కువ గోల్స్ తేడాతో భారత్ ఈ ఫైనల్ మ్యాచ్ ను గెలవడం ప్రత్యర్థి జట్టు అయిన చైనా హాకీ ఆటగాళ్ల గొప్ప పరాక్రమమైన ఆటతీరుకు ఓ నిదర్శనం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏదిఏమైన ఈ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత హాకీ జట్టు ఎంత తేడాతో గెలుపొందింది అనే విషయాన్ని మనమంతా ఒక్కసారి పక్కన పెడితే ఈ టోర్నీ చరిత్రలోనే ఇప్పటివరకు 8 ఏసీటీ ఈవెంట్లు జరిగితే ఇందులో అత్యధికంగా మన భారత హాకీ జట్టు వరుసగా 2011,2016,2018 ( పాక్ తో కలిసి సంయుక్త విజేత ), 2023,ప్రస్తుతం 2024 లో సైతం విజేతగా ఐదు సార్లు ఆవిర్భవించడం అనేది ఎంతైనా హర్మన్ ప్రీత్ సారథ్యంలోని భారత హాకీ జట్టు యొక్క ప్రతిభా సామర్థ్యాలకు,అంచెలంచెల పట్టుదల,అవిరళ కృషికి ఓ మచ్చుతునకగా మనం అభివర్ణించవచ్చు.ఏమైనా ఈ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ లో మాత్రం చైనా హాకీ జట్టు నుంచి ఎదురైనా ఓ పెనుసవాల్ ను మన భారత హాకీ జట్టు ఆటగాళ్లు ఓ ఛాలెంజింగ్ గా తీసుకోని, స్వీకరించి మరీ ఎట్టకేలకు ఆఖరి క్వార్టర్ లో కెప్టెన్ హర్మన్ ప్రీత్ వద్దకు వచ్చిన బంతిని నేర్పుగా చైనా డిఫెండర్లను ఏమార్చుతూ డి ఏరియా వద్ద అప్రమత్తంగా వున్న జుగ్ రాజ్ కు పాస్ చేయడం, అతను ఎలాంటి పొరపాటుకు తావు ఇవ్వకుండా బంతిని గోల్ పోస్టులోకి తరలించడంలో భారత హాకీ జట్టు ఆటగాళ్ల సంబరాలు అంబరాన్ని అంటాయి అనే మాట సత్యదూరం కాదు.జయ జయహో హర్మన్ ప్రీత్ సేన! చక్ దే ఇండియా! మేరా భారత్ మహాన్!బోలో భారతమాతాకీ జై!

**బుగ్గన మధుసూదనరెడ్డి, 9000369660**

## భాద్యులను కటినంగా శిక్షించాలి

తిరపతి లడ్డులంటే ఇష్టపడనివారుండరు 1980 దశకంలొ గుడి ఎదురుగ లడ్డులు ఐదురూపాయలకు ఇచ్చేవారు అయితే గతప్రభుత్వంవారు లడ్డులలో చేపనూనె , పంది కొవ్వు , జంతువుల కొవ్వు కలిపి ఇచ్చారని పరిశొధనలో తెలింది. ఇది దుర్మార్గం.ఎందుకంటె నెయ్యి కూరలలో వెసుకుంటే అన్నం రుచిగాఉంటుంది అందుకని మజ్జిగ అన్నంలో వెసుకుంటే మొత్తం వదలిపెడతాం అలాగె సబ్బుతొ బట్టలు ఉతికితే తెల్లగావస్తాయి. అందుకని అన్నము వండుకునే బియాన్ని సబ్బుతొ కడిగితె అన్నం మీద విరక్తి కలుగుతుంది. అలాగె లడ్డులలో ఏవివేస్తే రుచిగాఉంటాయో అవిమాత్రమే వెయ్యాలి. అందుకని ఆరోగ్యానికీమంచిదని , బలమని తిరుపతిలడ్డులలో చేపనూనె , పంది కొవ్వు , జంతువుల కొవ్వు కలిపితే లడ్డులమీదకూడా విరక్తి కలుగుతుంది. బహుశా అందుకె కలిపారేమో !! అయినా లడ్డులలో కొవ్వు కలుపుతుంటే టీటీడి భక్తబృందాలు , భజనబృందాలు ఎమిచేస్తున్నాయి? కొండమీద ఏసుబొమ్మ కనపడితె పరమత ప్రచారం జరుగుతుందని గగ్గోలుపెట్టే వారంతా ఏమైనారు ? అదేదొ వజ్రం చంద్రబాబు ఇంట్లొ ఉందని వాపోయిన ప్రధానపుజారి ఎక్కడ నిద్రపోతున్నాడు ? ఇందిరాగాంధీని పూరియాలయంలోకి రానివ్వని మతరక్షకులు , అయ్యప్పకు తనపాటల ద్వారా ఎంతో పేరుప్రఖ్యాతులు తెచ్చిన జేసుదాసుని అయ్యప్ప గుళ్ళోకి అడుగుపెట్టనివ్వని వారంతా అపుడెక్కడ జోగున్నారు ? ఎక్కడివాడే పదార్థాలు అక్కడవాడాలి. ఎమైనా లడ్డులలో చేపనూనె , పందికొవ్వు , జంతువులకొవ్వు వాడిన వారిని పట్టుకొని , అందుకు సూత్రధారులను కూడా తెలుసుకుని కటినంగా శిక్షించాలి.

**సిర్నెవెంకటసుబ్బయ్య**
**9290617819**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# కాంగ్రెస్ కుల మతాల మధ్య చిచ్చు పెడుతోంది

పల్వల్: కులమతాల మధ్య చిచ్చు పెడుతూ దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాన నరేంద్ర మోదీ (%చ్ఛుతీవఅంతీు వీశీంఱ%) అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్వల్‌లో మంగళవారం జరిగిన ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. కుల రాజకీయాలు, అవినీతి, రిజర్వేషన్లతో సహా పలు అంశాలపై కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. "ఒక సామాన్య కార్యకర్తగా చాలాకాలంగా హర్యానా రాజకీయాలను ఆమూలాగ్రంగా నేను గమనించాను. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకునే అవకాశం ఇటీవల నాకు కలిగింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఇదే నా చివరి ర్యాలీ. అయితే ఇది ఒక ప్రత్యేకమైన ర్యాలీగా ఎప్పటికీ గుర్తుండిపోయేలా మీరు చేశారు" అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రామమందిర నిర్మాణానికి అడ్డుపడిందని, జమ్మూకశ్మీర్‌లో సంపూర్ణంగా రాజ్యాంగాన్ని అమలు కానీయలేదని, అసెంబ్లీల్లో, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ పాటించలేదని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేదని, కేవలం సొంత కుటుంబం కోసమే పనిచేసిందని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నో పాపాలు చేసినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే కలలు కంటోందని అన్నారు. కులతత్వాన్ని ప్రచారం చేస్తూ దేశభక్తిని అణగదొక్కాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. దేశభక్తుల ఐక్యతను దెబ్బతీయాలనుకుంటోందని ఆరోపించారు. హర్యానా ప్రజలు సమైక్యంగా నిలిచి అభివృద్ధికే ఓటు వేయాలని కోరారు. దేశాన్ని ప్రేమించే వారంతా ఐక్యంగా ఉంటామని హర్యానా ప్రజలు ప్రతిన పూనాలన్నారు.



# కాంగ్రెస్ 'లాపతా లేడీస్'

- మహారాష్ట్రలో కాంగ్రెస్ వినూత్న ప్రచారం
- రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీల ఏర్పాటు
- ఏడాదిలో 64వేల మంది మహిళలు కనిపించకుండా పోయారు
- మహిళల మిస్సింగ్ పై జాతీయ మీడియా కథనాలు




ముంబయి: మహారాష్ట్రలో త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో అధికార పక్షం విధానాలు, ప్రజలకు ఎదురవుతోన్న సమస్యలపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. మహిళల అదృశ్యం అంశాన్ని లేవనెత్తుతూ 'లాపతా లేడీస్' పోస్టర్లతో కాంగ్రెస్ వినూత్న ప్రచారాన్ని ప్రారంభించింది. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడణవీస్, అజిత్ పవార్‌ల చిత్రాలు ప్రతిబింబించేలా రూపొందించిన ఫ్లెక్సీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసింది. అలాగే ఏడాదిలో 64వేల మంది మహిళలు కనిపించకుండా పోయారని అందులో పేర్కొంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మహిళల మిస్సింగ్ ఘటనలపై గతంలో దేవేంద్ర ఫడణవీస్ మాట్లాడుతూ..

"మహిళల భద్రత అత్యంత ఆందోళనకర అంశంగా ఉంది. మహారాష్ట్రలో ఏటా 64 వేల మంది బాలికలు, మహిళలు మిస్ అవుతున్నారు. 2019, 2020లో ఆ సంఖ్య ఒకేలా ఉంది. 2021లో ఈతరహాలో 61వేల కేసులు నమోదయ్యాయి. అందులో 87 శాతం మంది తిరిగివచ్చారు. 2022లో 86 శాతం మంది తిరిగి ఇళ్లకు చేరుకున్నారు. ఈ సమస్యను కట్టడి చేసేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం మహారాష్ట్రలో భాజపా, శివసేన(శిందే), ఎన్‌సీపీ(అజిత్ పవార్)లతో కూడిన మహాయుతి అధికారంలో ఉంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో మహావికాస్ అఘాడీ.. ఈ కూటమికి గట్టి పోటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. గతేడాది విడుదలైన హిందీ సినిమా 'లాపతా లేడీస్' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు వధువులు రైలు ప్రయాణంలో అనుకోకుండా తారుమారవుతారు. మరి ఆ తర్వాత వారి జీవితాలు ఎలా సాగాయి? వాళ్ల భర్తల దగ్గరికి ఎలా చేరుకున్నారు? అనేది ఇందులో చూపించారు. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమాను ఓవైపు ప్రేక్షకుల్ని నవ్విస్తూనే.. మరోవైపు సమాజంలోని మహిళల గుర్తింపు గురించి ప్రశ్నలు లేవనెత్తేలా సందేశాత్మకంగా తీర్చిదిద్దారు. పితృస్వామ్య వ్యవస్థపై తీసిన వ్యంగ్య చిత్రమిది. ఈ చిత్రం 2025 ఆస్కార్ పురస్కారాలకు మనదేశం నుంచి అధికారికంగా ఎంపికైంది.

# అగ్నిగుండంలా మారిన అమెజాన్ అడవి

- బ్రెజిల్‌లో 80 శాతం కమ్ముకొన్న పొగ
- 14 ఏళ్లలో ఏనాడు ఈ స్థాయి కార్చిచ్చు
- లక్షల హెక్టార్ల అటవీ భూమి, పొలాలు దహనం
- ఓ వైపుతీవ్ర కరవు.. మరో వైపు కార్చిచ్చులతో బ్రెజిల్ విలవిల



బ్రసీలియా: అమెజాన్ అడవుల్లో భీకర కార్చిచ్చు రగులుకొంది. దీని దెబ్బకు 80శాతం బ్రెజిల్‌లో పొగచూరుకొంది. గత 14 ఏళ్లలో ఏనాడు ఈ స్థాయి కార్చిచ్చులు రాలేదని ఈయూ కోపర్నికస్ అబ్జర్వేటరీ పేర్కొంది. ఓవైపు బ్రెజిల్ తీవ్రమైన కరవుతో ఇబ్బందిపడుతుంటే మరోవైపు ఈ కార్చిచ్చులు పచ్చదనాన్ని దహనం చేస్తున్నాయి. ఇప్పటికే అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా, కొలంబియా, ఈక్వెడార్, పరాగ్వే, పెరూల్లో లక్షల హెక్టార్ల అటవీ భూమి, పొలాలు దహనమైపోయాయి. భూమిపై అమెజాన్ బేసిన్ అత్యంత తేమ ప్రాంతంగా పేరుంది. కానీ, గత వారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్పేస్ రీసెర్చ్ ఉపగ్రహ చిత్రాల్లో 80శాతం చిత్రాల్లో బ్రెజిల్‌పై పొగచూరుకొని ఉన్నట్లు తేలింది. ఈ పొగ పీలిస్తే రోజు ఐదు సిగరెట్లు తాగినంత ప్రభావం ఆరోగ్యంపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో బ్రసిలియాలో అతిపెద్ద ఆస్పత్రులకు చాలామంది రోగులు శ్వాస సంబంధ ఇబ్బందులతో వస్తున్నట్లు గణంకాలు చెబుతున్నాయి. బ్రసిలియాలో దాదాపు 160 రోజులుగా చుక్క వర్షం పడలేదు. దీంతో ప్రజలు ఫ్యాన్ల వినియోగం పెరిగింది. మరోవైపు ప్రజలు మాస్కులు ధరించాల్సిన పరిస్థితి నెలకొంది.

## న్యాయం కంటే స్వేచ్ఛనే ఎంచుకున్నా

- వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే పిలుపు
- జర్నలిజం స్వేచ్ఛాయుత సమాజానికి మూలస్తంభం
- స్వేచ్ఛా దీపం ఆరిపోకుండా కృషి చేయండి: అసాంజే
- విధులను నిర్వర్తిస్తున్నందుకు జర్నలిస్టులను విచారించవద్దు
- ఐరోపా కౌన్సిల్‌లోని న్యాయ, మానవహక్కుల వ్యవహారాల కమిటీ ముందు అసాంజే



వాషింగ్టన్: అమెరికా సైనిక రహస్యాలను బహిర్గతం చేశాడన్న ఆరోపణలపై జైల్లో ఉన్న వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఈ ఏడాది జూన్‌లో విడుదలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తొలిసారి మాట్లాడిన ఆయన.. తన స్వేచ్ఛను రక్షించేందుకు న్యాయ, చట్టపరమైన ప్రయత్నాలు సరిపోలేదని, అందుకే అమెరికా గూఢచర్య ఆరోపణలపై తన నేరాన్ని అంగీకరించానన్నారు. ఐరోపా పార్లమెంటు చట్టసభ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన.. పలు కారణాలతో తాను జైలు నుంచి విడుదల కాలేదని, జర్నలిజం నేరాన్ని అంగీకరించినందునే తనకు స్వేచ్ఛ లభించిందన్నారు. "నేను చివరకు అవాస్తవిక న్యాయం కంటే స్వేచ్ఛను ఎంచుకున్నా. జర్నలిజం, విశ్వసనీయ వర్గాల నుంచి సమాచార సేకరణ, వాటిని బహిర్గతం చేశానని అంగీకరించినందునే జైలు జీవితం నుంచి విముక్తి లభించింది. జర్నలిజం నేరం కాదు. స్వేచ్ఛాయుత, సమాచార సమాజానికి మూలస్తంభం. ముఖ్య అంశం ఏంటంటే.. తమ విధులను నిర్వర్తిస్తున్నందుకు జర్నలిస్టులను విచారించవద్దు" అని ఐరోపా కౌన్సిల్‌లోని న్యాయ, మానవహక్కుల వ్యవహారాల కమిటీ ముందు జూలియన్ అసాంజే చెప్పారు. స్వేచ్ఛా దీపం ఆరిపోకుండా, సత్యాన్వేషణ కొనసాగేలా, కొందరి ప్రయోజనాల కోసం ఎందరో గొంతుకలను అణచివేయకుండా చూసేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2006లో వికీలీక్స్‌ను స్థాపించిన ఆస్ట్రేలియాకు చెందిన అసాంజే.. దాని ద్వారా అమెరికాకు సంబంధించిన అనేక సైనిక రహస్యాలను బయటపెట్టారు. ఇరాక్, అఫ్గాన్‌లో అమెరికా సైన్యం దారుణాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి కీలక సమాచారాన్ని బయటపెట్టడం సంచలనం రేపింది. దీంతో అమెరికా నుంచి ప్రాణభయం ఉందన్న కారణంతో లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో అసాంజే కొన్నేళ్లు ఆశ్రయం పొందారు.

# లెబనాన్ ఖాళీ చేసి వెళ్లిపోండి

### వరుస దాడులతో ఇజ్రాయెల్ హెచ్చరిక



టెల్ అవీవ్: హెజ్‌బొల్లా ను నిర్వీర్యం చేసే లక్ష్యంతో లెబనాన్‌లో ఆ గ్రూప్‌పై ఇజ్రాయెల్ వరుస దాడులతో విరుచుకుపడుతోంది. భూతల దాడులు చేపట్టేందుకు ఇప్పటికే ఇజ్రాయెల్ సేనలు ఆ దేశంలోకి ప్రవేశించాయి. ఈ తరుణంలో సరిహద్దు ప్రాంతాల్లోని లెబనాన్ పౌరులు తమ ఇళ్లను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది. దీనికి సంబంధించిన ప్రకటనను ఆ దేశ సైన్యం ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. సరిహద్దు నుంచి 60 కి.మీ దూరంలో ఉంటున్న పౌరులంతా ఖాళీ చేయాలని అందులో పేర్కొంది. 2006లో ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా యుద్ధం తర్వాత రెండింటి మధ్య యూఎన్ బఫర్ జోన్‌గా కొంత ప్రాంతాన్ని ప్రకటించింది. దాని ఉత్తర అంచుభాగంలో లిటానీ నది ఉంటుంది. సరిహద్దు నుంచి అక్కడివరకు దూరం 30 కి.మీ. ఇప్పుడు ఇజ్రాయెల్ ఖాళీ చేయమన్న ప్రాంతం దానిని మించి ఉంది.

**నేరుగా పోరాడతాం: హెజ్‌బొల్లా** ఇజ్రాయెల్‌లో భూతల దాడుల గురించి ప్రకటన చేసిన తర్వాత తొలిసారి హెజ్‌బొల్లా స్పందించింది. ఆ గ్రూప్ ప్రతినిధి మహమ్మద్ ఆఫిఫి మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ బలగాలు లెబనాన్‌లోకి ప్రవేశించాయనేది అవాస్తవమని చెప్పారు. శత్రువులతో నేరుగా పోరాడేందుకు తమ ఫైటర్స్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇజ్రాయెల్ వైపు మధ్యశ్రేణి క్షిపణులు ప్రయోగించామని, అది ప్రారంభం మాత్రమే అని హెచ్చరించారు. గత కొన్ని రోజులుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఇటీవల బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా, మరో కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యారు. ఇజ్రాయెల్ సైన్యం మొదట సరిహద్దుల్లో వైమానిక దాడులు నిర్వహించి భూతల దాడులకు మార్గం సుగమం చేసుకుంది. అయితే, 2006లో ఇలాంటి ప్రయత్నం ఇజ్రాయెల్‌కు ఇబ్బందికర వాతావరణం సృష్టించింది. మళ్లీ అలాంటి సమస్యలు రాకుండా సరిహద్దుల వద్ద ఉన్న స్థావరాలపై మాత్రమే దాడులు చేస్తోంది. వైమానిక దాడులు కొనసాగే అవకాశముంది. హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడుల్లో ఇప్పటి వరకు వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

# 13 ఏళ్ల తరువాత బళ్లారి వెళ్తున్న

- గాలి జనార్ధన్ రెడ్డి
- అనుమతిచ్చిన సుప్రీంకోర్టు



బళ్లారి, కర్నాటక బ్యూరో: ఇనుప గనుల్లో అక్రమ తవ్వకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక మాజీ మంత్రి, ప్రస్తుత గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి 13 ఏళ్ల తర్వాత తన సొంత జిల్లా బళ్లారికి వెళ్లనున్నారు. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో బళ్లారిలో అడుగుపెట్టనున్నారు. గనుల తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో 2011 సెప్టెంబరు 5న సీబీఐ ఆయన్ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించింది. మూడేళ్లకు పైగా హైదరాబాద్, బెంగళూరు జైళ్లలో ఆయన శిక్ష అనుభవించారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. బళ్లారి, ఉమ్మడి అనంతపురం, కడప జిల్లాలకు వెళ్లకుండా ఆంక్షలు విధించింది. అప్పట్నుంచి ఆయన గంగావతి, బెంగళూరుల్లోనే ఉంటున్నారు.

# ఇజ్రాయెల్‌పై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు

### ఇరాన్‌కు అమెరికా స్ట్రాంగ్ వార్నింగ్



వాషింగ్టన్: పశ్చిమాసియా భగ్గుమంటోన్న తరుణంలో మిత్ర దేశం ఇజ్రాయెల్ కు అమెరికా మద్దతుగా వ్యాఖ్యలు చేసింది. దానిపై నేరుగా దాడికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని యూఎస్ రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇరాన్‌ను హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు తనను తాను రక్షించుకునే హక్కు ఉందని పునరుద్ఘాటించారు. "భద్రతాపరమైన పరిస్థితులు, ఇజ్రాయెల్ ఆపరేషన్ల గురించి ఆ దేశ రక్షణమంత్రితో నేను మాట్లాడాను. తనను తాను రక్షించుకునేందుకు ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కుకు మా మద్దతు ఉంటుందని నేను స్పష్టం చేశాను. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన ఆ తరహా దాడులకు తావులేకుండా ఉండేందుకు సరిహద్దు వెంబడి హెజ్‌బొల్లాకు చెందిన నిర్మాణాలను నిర్వీర్యం చేయాల్సిన అవసరాన్ని మేం గుర్తించాం. సరిహద్దుకు ఇరువైపులా ఉన్న ప్రజలు సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగివెళ్లాలి. దానికి దౌత్యపరమైన తీర్మానం అవసరమని స్పష్టంచేశాను. ఇరాన్, దాని మద్దతున్న గ్రూప్‌ల నుంచి అమెరికా సిబ్బంది, మిత్రులను రక్షించుకునేందుకు యూఎస్ సంసిద్ధంగా ఉంది. ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి పాల్పడితే.. ఇరాన్ తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని లాయిడ్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# పెళ్లి కోసం అంబానీ కోట్లు ఖర్చుపెట్టింది ప్రజల సొమ్మే

- బహదూర్‌ఘర్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రోడ్‌షో
- బీజేపీపై విరుచుకు పడిన రాహుల్ గాంధీ
- మోడీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టారు
- నిరుద్యోగం బాగా పెరిగింది
- హర్యానాలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి: రాహుల్



చండీగఢ్: హర్యానాలో అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీలలో తమ అభ్యర్థుల కోసం అన్ని పార్టీల నేతలు భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం బహదూర్‌ఘర్‌లో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రోడ్‌షో నిర్వహించి బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ తన కుమారుడి పెళ్లికి కోట్లు ఖర్చు చేశారని, అయితే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "అంబానీ పెళ్లి చూశారా.. అంబానీ పెళ్లికి కోట్లు ఖర్చుపెట్టారు.. ఇది ఎవరిది.. ఇది మీ డబ్బు.. మీ పిల్లల పెళ్లి కోసం బ్యాంకులో అప్పు తీసుకుంటారు. నరేంద్ర మోడీ ఇలా చేశారు.. ప్రధాని మోడీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టారు. ఇంతే కాకుండా.. హర్యానాలో ఉన్న ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. గతంలో గ్యాస్ సిలిండర్ ధర రూ. 400 ఉండేది. నేడు అది రూ. 1200 ఉంది. హర్యానా రైతులు తమ ధాన్యానికి మద్దతు ధర రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుల నుంచి వరి కొనుగోలు చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. హర్యానా ప్రభుత్వంలో నిరుద్యోగం పెరిగిందని.. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు. పేదలకు రూ.3.5 లక్షలతో 100 గజాల ప్లాట్, 2 పడక గదుల ఇల్లు, 300 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామన్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం కాన్వాయ్‌పై దాడి

- హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో షాకింగ్ ఘటన
- బహిరంగ సభలో మాట్లాడుతుండగా గలభా సృష్టించిన అగంతకులు
- దుష్యంత్ చౌతాలా కాన్వాయ్‌పై రాళ్లు, ఇటుకలతో దాడి
- ఒక వాహనం అద్దాలు ధ్వంసం
- భారీ సంఖ్యలో ఘటనా స్థలికి చేరుకుని అదుపు చేసిన పోలీసులు



జింద్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. జింద్ జిల్లా ఉచన కలాన్‌లో జననాయక్ జనతా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దాడికి పాల్పడ్డారు. దుష్యంత్ చౌతాలా బహిరంగ సభలో మాట్లాడుతుండగా కొందరు అగంతకులు గలభా సృష్టించి కాన్వాయ్‌పై ఇటుకలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఒక వాహనం అద్దాలు పగిలిపోయాయి. దీంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. దుష్యంత్‌తో పాటు ఆజాద్ సమాజ్ పార్టీ నేత, ఎంపీ చంద్రశేఖర్ కూడా ఉచానాలో జరిగిన రోడ్‌షో పాల్గొన్నారు. ఉచానా అసెంబ్లీ నియోజకవర్గంని చౌతాలా పోటీ చేస్తున్నారు. చౌతాలా 2019లో ఇక్కడి నుంచి గెలిచారు. 2014లో బీజేపీ అభ్యర్థి ప్రేమ్‌లత చేతిలో ఓడిపోయారు. ఈసారి చౌతాలాపై బీజేపీ అభ్యర్థి చతర్భుజ్ అట్టారి (బీజేపీ), బ్రిజేంద్ర సింగ్ (కాంగ్రెస్) పోటీ చేస్తున్నారు.

**ఈసీకి లేఖ రాస్తా**

జింద్‌లో తన కాన్వాయ్‌పై దాడి ఘటనపై దుష్యంత్ చౌతాలా స్పందించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్టు చెప్పారు. దాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్ అంతా వారి దగ్గర ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్‌కు తప్పనిసరిగా లేఖ రాస్తామని చెప్పారు. ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి, గత రెండు ఎన్నికల్లోనూ తనపై దాడులు జరుగుతూనే ఉన్నారయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా ప్రత్యేక నిఘా బృందాన్ని ఇక్కడకు పంపాలని కోరారు. హర్యానాలోని 90 అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 5న ఒకే దశలో ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి

# రాజకీయ విద్వేషాలు, కుట్రలకు ఆమె బాధితురాలు

- తప్పుడు ఫిర్యాదులతో నా ఫ్యామిలీని వివాదాల్లోకి లాగారు
- భార్య పార్వతి గురించి సిద్ధరామయ్య వ్యాఖ్యలు
- లేఖ విడుదల చేసిన సిద్ధరామయ్య భార్య
- ముడా'కు చెందిన 14 ప్లాట్లు తిరిగి అదే సంస్థకు ఇచ్చేసిన పార్వతి



బెంగళూరు: 'ముడా ' స్కాం వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై సిద్ధరామయ్య స్పందించారు. రాజకీయ విద్వేషాలు, కుట్రలకు తన భార్య బాధితురాల అయ్యిందని ఆవేదన చెందారు. ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు తెలిపారు. "ముడా స్థలాల కేటాయింపులో భాగంగా మాకు వచ్చిన భూములను నా భార్య పార్వతి తిరిగిచ్చేసింది. ప్రతిపక్షాల తప్పుడు ఫిర్యాదులతో నా ఫ్యామిలీని వివాదాల్లోకి లాగారు. ఈ విషయం కన్నడ ప్రజలకు కూడా తెలుసు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలన్నదే నా సిద్ధాంతం. కానీ, నాపై జరుగుతున్న రాజకీయ కుట్రలు చూసి నా భార్య ఆవేదన చెందింది. అందుకే భూములను తిరిగి ఇచ్చేసింది. ఆమె నిర్ణయాన్ని నేను గౌరవిస్తున్నా. నాలుగు దశాబ్దాల రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా.. కుటుంబ బాధ్యలకు పరిమితమైన నా భార్య ఇలాంటి విద్వేషాలకు బలై మానసిక క్షోభ అనుభవిస్తోంది." అని సిద్ధరామయ్య సుదీర్ఘ పోస్ట్ చేశారు. సిద్ధరామయ్య భార్య లేఖ ఇకపోతే, సోమవారం సిద్ధరామయ్య భార్య పార్వతి ఓ లేఖ విడుదల చేశారు. 'ముడా'కు చెందిన 14 ప్లాట్లు తిరిగి అదే సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. అవినీతి మచ్చలేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న ప్లాట్లను ఇచ్చేస్తున్న అని వెల్లడించారు. "మా అన్నయ్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈ ప్లాట్లు ఇంత రాద్ధాంతం చేస్తాయని అనుకోలేదు. నా భర్త గౌరవానికి మించి ఈ ఆస్తులు ఎక్కువ కాదు. ఇన్నేళ్లు ఆయన అధికారం నుంచి ఏమీ ఆశించని మాకు ఈ ఆస్తులు ఓ లెక్క కాదు. అందుకే ఈ స్థలాలు తిరిగి ఇచ్చేస్తున్నా. ఈ విషయంలో నా భర్త అభిప్రాయం తెలియదు. నా ఫ్యామిలీతో చర్చించకుండా తీసుకున్న నిర్ణయమిది. ఆరోపణలు వచ్చిన రోజే ఈ నిర్ణయం తీసుకోవాలనుకున్నా. రాజకీయ కుట్రలో నా భర్త మరింత నష్టపోతున్నాడనే ఈ నిర్ణయం తీసుకున్నా. అసరమైతే విచారణకు కూడా సహకరిస్తా. రాజకీయాలకు దూరంగా ఉండే నా లాంటి మహిళలను వివాదాల్లోకి లాగొద్దు' అని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.

# డేరా బాబాకు మరోసారి పెరోల్

### 4ఏళ్లలో 15వసారి బయటకు



చండీగఢ్:డేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా మరోసారి పెరోల్‌పై జైలు నుంచి విడుదలవుతున్నారు. ఇద్దరు మహిళలపై లైంగికదాడి కి పాల్పడిన కేసులో అతనికి కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది.ప్రస్తుతం అతడు హర్యానాలోని రోహ్‌తక్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే వివిధ కారణాలతో గత తొమ్మిది నెలల్లో ఆయనకు రెండు సార్లు పెరోల్ లభించగా తాజాగా మరోసారి అతనికి పెరోల్ లభించింది.కాగా మరో నాలుగు రోజుల్లో హర్యానా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డేరా బాబా పెట్టుకున్న పెరోల్ పిటిషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది.అతని పెరోల్‌కు ఈసీ అనుమతివ్వడంతో హర్యానా ప్రభుత్వం ఆయన విడుదలకు త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు రానున్నారు.కాగా అతని పెరోల్ రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసిందిటెహ్రాన్: ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఏర్పాటుచేసిన


# కోల్‌కతాలో మళ్లీ ఆందోళనలు చేపట్టిన జూనియర్ డాక్టర్లు

- తమ భద్రతపై నమ్మకం లేదని ఆరోపణ
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి కనిపించనందుకే మళ్లీ ఆందోళనలు
- విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగిస్తాంః జూనియర్ డాక్టర్లు
- సెంట్రల్ కోల్‌కతాలోని స్వేర్ కళాశాల నుంచి ధర్మతల వరకు మార్చ్
- తమ ఆందోళనలో ప్రజలు పాల్గొనాలని పిలుపు

కోల్‌కతా: జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు తెలిపిన వైద్య విద్యార్థులు ఇటీవల ఆందోళనలు విరమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జూనియర్ వైద్యులు మంగళవారం తిరిగి ఆందోళనలు చేపట్టారు. తమ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి కనిపించడం లేదని వారు ఆరోపించారు. 'మా భద్రతకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల వైఖరి కనిపించడం లేదు. సీఎం మమతా బెనర్జీ చర్చల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించాం' అని ఓ డాక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఇది పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. ఇక, సెంట్రల్ కోల్‌కతాలోని స్వేర్ కళాశాల నుంచి ధర్మతల వరకు బుధవారం జూనియర్ వైద్యులు మార్చ్‌కు పిలుపునిచ్చారు. తమతో పాటు ఈ మార్చ్‌లో పాల్గొనాలని ప్రజలను కోరారు. పశ్చిమబెంగాల్‌లోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితురాలికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ ఘటన పెనుదుమారం రేపడంతో సుప్రీంకోర్టు దీన్ని సుమోటోగా స్వీకరించింది. ఈ క్రమంలో వైద్య విద్యార్థులు విధుల్లో చేరాలని సూచించింది. ఇక, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపి తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో 42 రోజులు కొనసాగించిన నిరసనలు విరమించి గతనెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. ఇదిలాఉండగా.. హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థికి న్యాయం చేయాలనేది వైద్య విద్యార్థుల ప్రధాన డిమాండ్. ఇక, ఆరోగ్య కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్‌ను విధుల నుంచి తొలగించడం, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రుల్లో పోలీసుల రక్షణను పెంచాలని, శాశ్వత మహిళా పోలీసు సిబ్బందిని నియమించాలనేవి వారి డిమాండ్లు.

# బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న స్కూల్ బస్సు
- 25 మంది చిన్నారులు మృతి



బ్యాంకాక్ : థాయ్‌ల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. పాఠశాల విద్యార్థులు, వారి టీచర్‌ను తీసుకెళుతున్న ఓ బస్సు మంటల్లో చిక్కుకొంది. సెంట్రల్ ఉతాయ్ థాని ప్రావిన్స్ నుంచి తిరిగివస్తుండగా జరిగిన ఈ ఘటనలో మొత్తం 25మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 44 మంది ప్రయాణిస్తున్నారు. థాయ్‌ల్యాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా మృతులకు సంతాపం తెలిపారు. విద్యార్థులు ట్రిప్‌కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. థాయ్‌ల్యాండ్ రవాణశాఖా మంత్రి ఈ ప్రమాదం వివరాలను వెల్లడించింది. "మొత్తం 44 మంది బస్సులో ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో 38 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. ఇప్పటివరకు 16 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లను రక్షించారు. మిగిలిన వారి విషయంపై ఇంకా స్పష్టత లేదు" అని పేర్కొన్నారు. ఇటీరియర్ మంత్రి అనుతిన్ చర్నవిరకుల్ మాట్లాడుతూ మృతుల సంఖ్యను ఇంకా ధ్రువీకరించలేమని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి సంఖ్య ఆధారంగా.. 25 మంది చనిపోయి ఉండొచ్చన్నారు. ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా.. మృతదేహాలు ఇంకా బస్సులోనే ఉండిపోవడం గమనార్హం. ఈ ప్రమాదంపై ఆన్‌లైన్‌లో పోస్టు అయిన వీడియోల్లో బస్సు నుంచి నల్లటి పొగ, భారీగా మంటలు ఎగసిపడుతున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల వయస్సు ఇతర వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఒక టైరు పేలిపోయినట్లు కొందరు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ సంస్థ తాము 10కిపైగా మృతదేహాలను చూసినట్లు ఫేస్‌బుక్‌లో పేర్కొంది.



# వరద సహాయక బృందానికి అభినందనలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి సెప్టెంబర్ 24, 2024 న జరిగిన భారీ వర్షాలు మరియు వరదల సమయంలో, ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో 15 సంవత్సరాలుగా నివాసం ఉంటూ సాయిరాం కేటరింగ్ నిర్వహిస్తున్న fisherman boat సొసైటీ బృందం (రవికుమార్, కర్రి పోసయ్య, కర్రి నాని, మల్లాది చరణ్‌పీ, వినోద్) మానవతా దృక్పథంతో తమ ప్రాణాలను పణంగా పెట్టి, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయం అందించారు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బంది పడుతున్న వృద్ధ మహిళలు, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు బోట్ల ద్వారా తరలించారు. శ్రీ బుడితి రాజశేఖర్ IAS, ప్రత్యేక వ్యవసాయ ప్రధాన కార్యదర్శి (వ్య. %&% సహకారం) మరియు శ్రీ ఎస్. డిల్లిరావు IAS, డైరెక్టర్ వ్యవసాయ శాఖ, వారి ప్రేరణతో రవికుమార్ మరియు ఇతరులు ఈ మహత్తర సేవ చేయగలిగింది. విపత్తు సమయంలో ప్రత్యేకాధికారులుగా ఉన్న శ్రీ బుడితి రాజశేఖర్ వారు వరద సహాయక బృందం ధైర్యం, సేవా కార్యక్రమాన్ని గుర్తించి అభినందించారు. వారి ధైర్యం, సాహసం గుర్తించి, ప్రత్యేక వ్యవసాయ ప్రధాన కార్యదర్శి వారు సచివాలయంలో తన చాంబర్‌లో రవికుమార్ బృందాన్ని సన్మానించారు.

# త్వరలో ఏపీలో హైడ్రా

- రాష్ట్ర వ్యాప్తంగా కూల్చివేతలు
- మంత్రి నారాయణ సంచలన వ్యాఖ్యలు
- వరదలు విజయవాడలో అల్లకల్లోలం సృష్టించడం లోకమంతా చూసింది
- ఆపరేషన్ బుడమేరు మాదిరిగా అక్రమ నిర్మాణాలపై దృష్టి పెడతాం: మంత్రి నారాయణ



విజయవాడ, ఏపీ బ్యూరో: మంత్రి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం తరహాలో ఏపీలో కూడా రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ కట్టడాలు, నదులు, వాగులు, వంకలు పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు చేపడతామని వెల్లడించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏపీ సీఎం చంద్రబాబు బుధవారం మచిలీపట్నంలో పర్యటిస్తారని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఈ నేపథ్యంలో నేషనల్ లా కాలేజ్, డంపింగ్ యార్డ్, టీటీడీకళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పర్యటన కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఏపీలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు విజయవాడలో అల్లకల్లోలం సృష్టించాయన్నారు. ఈ నేపథ్యంలో వర్షపు నీటి కాలువ ఆక్రమణలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. బుడమేరు ఆక్రమణల వల్ల విజయవాడకు భారీ వరద వచ్చిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆపరేషన్ బుడమేరు మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చోట్ల అక్రమ నిర్మాణాలపై దృష్టి పెడతామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కాలువలు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని హెచ్చరించారు. ఏ రాజకీయ పార్టీ వారైనా ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపించి అక్రమ నిర్మాణాలు కూల్చి వేస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

## ఐపీఎస్‌ల ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ

- రిమాండ్ రద్దు చేయాలని పిటిషన్
- సినీనటి కాదంబరీ జత్వానీ కేసులో ముగిసిన వాదనలు
- గురువారం వాదనలు వినిపంచనున్న అడ్వకేట్ జనరల్
- తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా




అమరావతి, ఏపీ బ్యూరో: ముంబయి సినీనటి కాదంబరీ జత్వానీ కేసులో ఐపీఎస్‌లు, ఏసీపీ, సీఐ ముందస్తు బెయిల్ పిటిషన్‌లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు వాదనలు ముగిశాయి. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం గురువారానికి వాయిదా వేసింది. అడ్వొకేట్ జనరల్ ఎల్లుండి వాదనలు వినిపించనున్నారు. మరో వైపు ఈ కేసులో రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా పడింది.

## గనులశాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డికి

### 3 రోజుల ఏసీబీ కస్టడీ



విజయవాడ, ఏపీ బ్యూరో: గనులశాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డిని 3 రోజుల పాటు ఏసీబీ అధికారుల కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. వైకాపా ప్రభుత్వ పెద్దలు గత ఐదేళ్లలో సాగించిన ఇసుక, ఖనిజ, గనుల దోపిడీకి వెన్నుదన్నుగా నిలిచి.. సర్వం తానై వ్యవహరించిన గనులశాఖ పూర్వ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిని ఏసీబీ అధికారులు సెప్టెంబరు 26న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అనంతరం విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి.. వెంకటరెడ్డిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి.. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఏసీబీ కస్టడీకీ అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై పవన్ కీలక వ్యాఖ్యలు



ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని మాత్రమే చంద్రబాబు తెలిపారని ఉప ముఖ్య మంత్రి -పవన్ తెలిపారు.గత ఐదేళ్లలో అనేక తప్పిదాలు జరిగాయని, ప్రభుత్వం అన్నింటిపై విచారణ జరుపుతుందని తెలిపారు. ప్రాయశ్చిత్త దీక్ష కేవలం లడ్డూ కోసం కాదని పవన్ అన్నారు. లడ్డూ వివాదం కేవలం ట్రిగ్గర్ మాత్రమేన్ని, కొన్నేళ్లుగా 219 టెంపుల్స్ ధ్వంసం చేశారని తెలిపారు. రామతీర్థంలో రాముడి తల నరికారు ఇది కేవలం దీక్ష మాత్రమే కాదు.. శాశ్వత పరిష్కారం కోరుతూ చేపట్టిన దీక్ష అని అన్నారు. సనాతన పరిరక్షణ బోర్డు ఉండాలని కోరుకుంటున్నానని -పవన్ అన్నారు

## అభివృద్ధి తో పాటు సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం

- జగన్ మాట తప్పారు చంద్రబాబు మాట నిలబెట్టారు
- ఫించన్ల పంపిణి చరిత్రలో నిలిచిపోతుంది:మంత్రి సవితమ్మ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజవర్గం పెనుకొండ మున్సిపాలిటీ పరిధిలోని 12, వార్డు 13వ వార్డులో వరుసగా నాలుగో నెల ఇంటి వద్దకే వచ్చి, ఒకటో తారీఖునే పింఛన్ ను పంపిణీ చేసిన బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితమ్మ ఉద్యోగులు, స్థానిక నేతలు. ఫించన్ దారులతో మంత్రి సవితమ్మ మాట్లాడుతు చంద్రన్న ప్రభుత్వం ఎలా ఉంది, ఫింఛన్ ఎంత వస్థోంది, సమస్యలు ఏమైనా ఉన్నాయ అని అడిగి తెలుసుకున్నారు.వైసిపి పాలనలో రాష్ట్రం 40 ఎళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందని,ఇచ్చిన మాటలన్ని తప్పి జగన్ మాట, మడమ తిప్పేసారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవగానే ఇచ్చిన మాట ప్రకారం ఫించన్ పెంచాడని,రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడపడం మొదలెట్టాడని, సంక్షేమం తో పాటు అభివృద్ధి చేసి చూపిస్తున్నాడన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకపక్క అభివృద్ధితో పాటు మరోపక్క సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సవితమ్మ తెలియజేశారు. అదేవిధంగా పెనుకొండ టౌన్ లో అమృత్ స్కీం ద్వారా 87 కోట్ల తో %నాూ=% ట్యాంకులు పైప్ లైన్ ఇంటింటికి కొలాయి ద్వారా నీటి మంచినీటి అందజేస్తామని, అదేవిధంగా సెంటర్ లైటింగ్ కి 10 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు కూడా పంపామని , డివైడర్స్ కు మధ్యలో ప్లాంటేషన్ కోసం ఒక లక్ష రూపాయలు కేటాయించామని మరియు డ్రైనేజ్ అండ్ డి షెల్టింగ్ కి 11 లక్షల రూపాయలతో నిధులు కేటాయించామని , అదే విధంగా రైల్వే స్టేషన్ రోడ్డు, కోనాపురం రోడ్డుకి ప్రతిపాదనలు పంపామని, టిటిడి కళ్యాణ మండపం కోసం 6 కోట్లతో మూడు అంతస్తుల నిర్మించడానికి టిటిడి వారు ఆమోదించారని పెనుకొండ లో పేద విద్యార్థుల కోసం ఒక ఏంజెపి స్కూల్ కూడా తెచ్చామని ఇస్కాన్ వారి సహకారంతో కొండమీద లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ కూడా కడతామని తెలియజేసిన మంత్రి సవితమ్మ గారు .. కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెరిగిన వంటగ్యాస్ సిలిండర్ ధరలు

- పండగల ముందు సామాన్య ప్రజల మీద భారం
- ప్రతి నెలా మొదటి తేదీన ఎల్పీజి ధరల్లో మార్పులు చేస్తున్న ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తాజాగా రేట్లను పెంచాయి.



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఆయిల్ కంపెనీలు ఎల్పీజి ధరలు పెంచాయి. దసరా, దీపావళి పండుగలకు ముందు ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 19 కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను రూ.50 పెంచాయి. 14.2కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ లలో కమర్షియల్ సిలిండర్ ధర రూ.1,967, డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.855గా ఉంది.

## లక్ష ఆవులను దాతల సాయంతో సమీకరిస్తా

- శ్రీవారి కోసం సొంత డెయిరీకి ప్లాన్ చేయండి
- రోజుకు 30 టన్నుల నెయ్యి తయారీ చేయొచ్చు
- 10 వేల మందికి ఉపాధి కల్పించే చాన్స్ ఉంది
- టీటీడీకి బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సూచన
- తిరుమల పరిరక్షణ పాదయాత్ర ముగింపులో సంచలన ప్రకటన
- గోవులను పెంచి, పోషించడమూ ధార్మిక ప్రచారమేనని వెల్లడి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటు చేసి, సొంతంగా నెయ్యి తయారు చేస్తే తన వంతుగా భూరి విరాళం అందిస్తానని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ అన్నారు. తిరుమల పరిరక్షణ పాదయాత్ర ముగింపు సందర్భంగా మంగళవారం సంచలన ప్రకటన చేశారు. శ్రీవారికి అపచారం జరగకుండా తానే ఓ పెద్ద బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. వందలాది మంది భక్తులతో కలిసి ఆయన చేపట్టిన తిరుమల పరిరక్షణ పాదయాత్ర మంగళవారం ఉదయం స్వామి దర్శనంతో ముగిసింది.. ఈ సందర్భంగా తిరుమలలో మీడియాతో మాట్లాడుతూ.. కీలక ప్రకటన చేశారు.. లడ్డూ ప్రసాదం తయారీ సహా స్వామి పూజల్లో వినియోగించే నెయ్యిని సొంతంగా తయారు చేయాలని సూచించారు.

## 1.48 కోట్ల రేషన్ కార్డుదారులకు కంది పప్పు, పంచదార

- కిలో కందిపప్పు రూ.67... అర్థ కిలో పంచదార రూ.17
- నేటి నుంచి పంపిణీ ప్రారంభం
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ కార్డుదారులందరికీ కంది పప్పు, పంచదార పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఇందులో భాగంగా కందిపప్పు కిలో, పంచదార అర్థ కిలో అందిస్తామని తెలిపారు. ఈ పంపిణీ ద్వారా 1,48,43,671 మంది రేషన్ కారుదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కిలో కందిపప్పు ధర రూ.67, అర్థ కిలో పంచదార రూ.17గా నిర్ణయించారు. ఈ రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, పంచదార కూడా రేషన్ కార్డులకు అందిస్తారు.

**నిత్యావసర సరుకులు అందుబాటు ధరల్లో ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం**

నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "కిలో రూ.163 ధర ఉన్న కందిపప్పును రేషన్ కార్డుదారులకు రూ.67కి అందిస్తున్నాం. రూ.96 సబ్సిడీ ఇస్తున్నాము. కూటమి ప్రభుత్వం పాలన మొదలైనప్పటి నుంచి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రజలకు నిత్యవసర సరుకులు అందుబాటు ధరల్లో ఉంచేలా చూడాలని పౌర సరఫరాల శాఖకు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో రెండుమార్లు బియ్యం, కందిపప్పు ధరలు తగ్గించేలా చూశాము. రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో కిలో కందిపప్పు దేశవాళీ రకం రూ.150కి, బియ్యం (స్టీమ్డ్-బీపీటీ/సోనా మసూరి) రూ.48, బియ్యం (పచ్చి బీపీటీ/సోనా మసూరి) రూ.47కి విక్రయించేలా చూశాము. ఇప్పుడు రేషన్ కార్డుదారులకు కందిపప్పు, పంచదార కూడా అందుబాటులోకి తీసుకువచ్చాము. కూటమి ప్రభుత్వం ఉద్దేశం ఒకటే ప్రజలకు, పేదలకు నిత్యవసరాలు అందుబాటు ధరల్లోకి తీసుకురావడమే. అదే విధంగా అనుకోని విపత్తులు సంభవించినప్పుడు సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న ప్రజలకు నిత్యవసరాలు ఇచ్చేలా శాఖను సన్నద్ధం చేసింది గా కూటమి ప్రభుత్వం. ఇటీవల సంభవించిన వరదల సమయంలో బాధితులకు బియ్యం 25 కేజీలు, నూనె 1 లీటరు, పంచదార 1 కేజీ, కందిపప్పు 1 కేజీ, ఉల్లిపాయలు 2 కేజీలు, ఆలుగడ్డ 2 కేజీలు అందించాము" అన్నారు.



## కేంద్ర ప్రాయోజిత పథకాలను యుద్ద ప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్ళాలి

- రాష్ట్రానికి మరిన్ని సిఎస్ఎస్ పథకాలు,నిధులు రాబట్టడమే లక్ష్యంగా పనిచేయాలి
- వివిధ దశల్లోని సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ ల పనుల వేగవంతం చేయాలి
- పూర్తైన పనులకు యుసిలు సమర్పిస్తే కేంద్రం నుండి తదుపరి నిధులు పొందవచ్చు
- పథకాల మలులో గల అడ్డంకులను తొలగించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు
- రాష్ట్ర డిజిపిలో 3వవంతు ఆదాయం వస్తున్నఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్రంలో అమలు జరుగుతున్న పలు కేంద్ర ప్రాయోజిత పథకాలను (%జవత్‌తీఖ్రీశ్రీఎ నాజూశీఅంశీతీవన నాఏష్ట్రవఎవం%)మరింత వేగవంతం చేసి యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్ళడం ద్వారా కేంద్రం నుండి మరిన్ని పథకాలు,నిధులు రాబట్టేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్ పై వైద్య ఆరోగ్య,వ్యవసాయ, సహకార,ఉద్యానవన మత్స్య,మున్సిపల్ పరిపాలన,గృహ నిర్మాణ,ఆర్థిక శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ పలు సెంట్రల్ సెక్టార్ స్కీములను నిర్దేశిత గడువు ప్రకారం సకాలంలో పూర్తి చేయడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను,నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని అన్నారు.ఇప్పటికే అమలులో ఉన్న పలు ప్రాయోజిత పథకాల అమలులో ఎదురవుతున్న చిన్నచిన్న ఇబ్బందులను అధిక మించి జాప్యం లేకుండా వాటిని ముందుకు తీసుకువెళ్ళి పనులు పూర్తి చేసిన కేంద్రం నుండి మరిన్ని నిధులు పొందే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.పూర్తయిన పనులకు సకాలంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్లను కేంద్రానికి సమర్పిస్తే తదుపరి వాయిదా నిధులు మంజూరు అయే వీలుంటుందని ఆదిశగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.కేంద్రం ప్రవేశపెట్టి రాష్ట్రంలో అమలు కాని ఇతర ప్రయోజిత ప్రధకాలేమైనా ఉంటే వాటిని కూడా రాష్ట్రంలో అమలు చేసేందుకు వీలుగా తగు పరిశీలన చేయాలని ఢిల్లీ ఎపి భవన్ రెసిడెంట్ కమీషనర్ లవ్ అగర్వాల్ ను మరియు సంబంధిత శాఖల కార్యదర్శులకు సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ సూచించారు. రాష్ట్ర జిడిపిలో మూడవ వంతు ఆక్వా రంగం నుండే వస్తోందని కావున ఆక్వా రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఆరంగంలో మంజూరైన వివిధ సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ లను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు మరిన్ని నిధులు,పథకాలను రాష్ట్రానికి తెచ్చేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆశాఖ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా చేపల,రొయ్యల చెరువుల వివరాలన్నిటినీ నూరు శాతం కంప్యూటరీకరించడం తోపాటు ఆయా ఉత్పత్తులకు తగిన పరీక్షల నిర్వహణకు తగిన ల్యాబ్ లను ఏర్పాటు చేసి రాష్ట్రం నుండి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు పెద్దఎత్తున ఎగుమతి అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.అంతేగాక నాబార్డు,ఎంపెడాల ద్వారా తగిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేయాలని సిఎస్ సూచించారు.అదే విధంగా రాయలసీమ,ఉత్తరాంధ్ర తదితర వెనుకబడిన జిల్లాలకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి కేంద్రం నుండి తగిన నిధులు మంజూరు చేయించుకునే అవకాశం ఉందని ఆదిశగా తగిన ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులకు సూచించారు. ఢిల్లీ నుండి ఎపి భవన్ రెసిడెంట్ కమషనర్ లవ్ అగర్వాల్ వర్చువల్ గా పాల్గొని మాట్లాడుతూ సిఎస్ఎస్ పథకాలకు సంబంధించి నిర్వహించిన పనులకు సకాలంలో యుసిలు సమర్పించ గలిగితే కేంద్రం నుండి తదుపరి నిధులు మంజూరు చేయించుకునేందుకు తగు అవకాశం ఉంటుందని చెప్పారు. తొలుత వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి కేంద్ర ప్రాయోజిత పథకాలపై చర్చించగా ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్తు ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్(%జూవీ-నూదీఎ×వీ%)కింద వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పడకల పెంపు,క్రిటికల్ కేర్ బ్లాకులు వంటి వైద్య పరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు ఐదేళ్ళ కాలానికి 367 కోట్ల రూ.లు మంజూరు కాగా వాటి కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.అదే విధంగా ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద గర్భిణీ స్త్రీలకు 5వేల రూ.లను చెల్లించే పథకం అమలు జరుగుతోందని వాటికి సలంలో నిధులు విడుదలైతే ఎక్కుమందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు.మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టిన టిడ్కో గృహాల ప్రాజెక్టును 21వేల 377 కోట్ల రూ.లతో చేపట్టగా దానిలో కేంద్రం వాటా రూ.3వేల 924 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.8595 కోట్లు,లబ్దిదారుల వాటాగా రూ.8856 కోట్లుగా ఉందని ఇప్పటి వరకూ 16వేల 900 కోట్ల రూ.ల పనులను పూర్తి చేయడం జరిగిందని మిగతా పనులు పూర్తి చేసేందుకు మరో 7వేల కోట్ల రూ.లు అవసరం ఉందని ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ సిఎస్ దృష్టికి తెచ్చారు.బలహీన వర్గాల గృహనిర్మాణానికి సంబంధించి పిఎంఎవై అర్బన్ కింద రూ.31వేల 146 కోట్లతో వివిధ గృహ నిర్మాణాలు చేపట్టగా ఇప్పటి వరకూ రూ.17వేల 359 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని ఆశాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ మైదీన్ వివరించారు.అలాగే పియంఎవై గ్రామీణ్,తదితర పథకాల కింద గృహ నిర్మాణాలు జరుగుతున్నట్టు తెలిపారు. వ్యవసాయ శాఖలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.737 కోట్ల తో 8 పథకాలు అమలవుతుండగా దానిలో రూ.442 కోట్లు కేంద్రం వాటా కాగా రూ.295 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా పనులు జరుగుతున్నట్టు ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వివరించారు. అదే విధంగా కృషోతన్నతి యోజన కింద 7 ఉప పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ మరియు సహకార శాఖలకు సంబంధించి వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (PACS) కంప్యూటరీకరణ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత అంశంగా చేపట్టిందని రాష్ట్రంలో ఆప్రక్రియ వేగవంతంగా సాగుతోందని శాఖ కమషనర్ బాబు ఏ వర్చువల్ గా పాల్గొని వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి జానకి,వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు,ఆరోగ్యశ్రీ సిఇఓ లక్ష్మీషా తదితర అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలుకు పటిష్టమైన బందోబస్తు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి తిరుమలలో ఈనెల 4 నుంచి 12వ తేదీవరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. తిరుమలలో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. అందుబాటులో 2 వేలకు పైగా సీసీ కెమెరాలను ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తామన్నారు. తిరుమాడ వీధుల్లో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.. ప్రయాణికులకు భద్రత ప్రథమ ప్రాధాన్యం కింద తీసుకుని ఆర్టీసీలో ప్రయాణం భద్రత ఉంటుందని అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న ద్వారకా తిరుమలరావు స్పష్టం చేశారు.. తిరుమలకు సమీప ప్రాంతాల నుంచి అదనపు బస్సులను నడుపుతున్నామని చెప్పారు.

## పట్టా భూములు, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ??


రాష్ట్రంలోని పట్టా భూములు, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా ఉత్తర్వులు ఇచ్చారు. భూయజమానులు నిబంధనల మేరకు ఇసుక విక్రయాలు చేసుకోవచ్చు. కాగా గ్రామ, వార్డు సచివాలయాలతోపాటు వ్యక్తిగతంగా ఇసుక ఆన్ లైన్ లో బుకింగ్ ప్రక్రియ ప్రాంబమైనది.



## జోగి రమేష్ కు నోటీసులు



చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మరోసారి మాజీ మంత్రి జోగి రమేష్‌కు ప్రభుత్వం నోటీసులు జారి చేసింది. మంగళగిరి డీఎస్పీ కార్యాలయంలో బుధవారం హాజరుకావాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల లోపు రావాలని నోటీసులు ఇచ్చింది.




# నీ నీడన నడిచే వరమివ్వు బాపూ...


## మానవ జాతిని ప్రేమించే మన మహాత్ముడు

## సర్వోదయ సిద్ధాంతాన్ని ప్రబోధించిన మహోన్నతుడు



**మోహన్ దాస్ కరంచంద్ గాంధీ... ఈ పేరు తెలియని భారతీయులు లేరంటే అతిశయోక్తి కాదు. 1869 వ సంవత్సరం అక్టోబర్ 2 వ తేదీన గుజరాత్ లోని పోరుబందర్‌లో ఒక సామాన్య కుటుంబలో జన్మించిన గాంధీజీ అహింస అనే ఆయుధంతో బ్రిటిష్ వారిని తరిమి కొట్టి మహాత్ముడయ్యాడు. తండ్రి కరంచంద్ గాంధీ, తల్లి పుత్లీబాయి. గాంధీజీ ఒక వ్యక్తి కాదు. ఒక ఉద్యమం. ఒక పోరాటశక్తి . సత్యం, శాంతి, అహింసలే ఆయుధంగా భారత దేశాన్ని ఒక తాటిపై నడిపించి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీశాలి. ఆ మహనీయుని త్యాగ ఫలితమే మనమీనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు. మహాత్ముడిగా మన్ననలు అందుకున్న గాంధీజీని ప్రజలు ప్రేమగా 'బాపూ' అని పిలిచేవారు. భారతదేశం ఆయనను 'జాతిపిత' అని గౌరవించింది. ఈ రోజు (అక్టోబర్ 2వ తేదీ) మహాత్మా గాంధీ 155వ జయంతి. ఐక్యరాజ్యసమితి ఇచ్చిన పిలుపు మేరకు అక్టోబర్ 2, గాంధీ జయంతి రోజును 2007 వ సంవత్సరం నుండి మనం "అంతర్జాతీయ అహింసా దినోత్సవం"గా జరుపుకుంటున్నాం.**








గాంధీజీ అనగానే మనకు స్వాతంత్ర్యోద్యమమే గుర్తొస్తుంది. కానీ ఆయన కేవలం స్వాతంత్ర్య పోరాటానికి మాత్రమే పరిమితం కాలేదు. మహిళలు, రైతులు, కూలీలు, చేతివృత్తుల వారు, ఇలా ప్రతి ఒక్కరినీ ఆదరించారు. వారి సంక్షేమం కోసం పోరాడారు. ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త మానవ జాతిని ప్రేమించారు ఆయన. "మన కాలంలో ఈ భూమిపై నడియాడిన దేవుడు గాంధీజీ" అని సుప్రసిద్ధ శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్నారంటే గాంధీజీ వ్యక్తిత్వం ఎంతటి మహోన్నతమైనదో మనకు అర్థమవుతోంది. సమాజంలోని ప్రజలందరి సంక్షేమాన్ని కాంక్షిస్తూ సర్వోదయ సిద్ధాంతాన్ని ప్రబోధించి, ఆ దారిలోనే జీవితాంతం నడిచిన ఆదర్శ మూర్తి ఆయన.

1869వ సంవత్సరం, అక్టోబర్ 2న పోరుబందర్ లో జన్మించిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీని ఒకటిన్నర శతాబ్దం గడచిన తరువాత కూడా ప్రపంచమంతా ఇంకా స్మరించుకుంటుంది అంటే ఆయన ఆశయాలు, అనుసరించిన మార్గాలు కారణమనే చెప్పాలి. మహాత్ముడు బోధించిన అహింసా మార్గం నేటి తరానికి కూడా ఆదర్శం అనడంలో అతిశయోక్తి లేదు. ఒక భారత దేశమే కాదు, విదేశీయుల మన్ననలు సైతం పొందిన అరుదైన నాయకుడు మన జాతి పిత గాంధీజీ.

గాంధీజీ గొప్ప పాత్రికేయుడు కూడా. "హరిజన్" అనే వారపత్రికను 1933 లో ఆయన ఎరవాడ జైలులో ఉన్న సమయంలో స్థాపించారు.

భారతదేశంలో అంటరానితనాన్ని నిర్మూలించడానికి, సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి గాంధీ చేసిన ప్రయత్నాలలో ఈ పత్రిక ముఖ్యమైన పాత్ర పోషించింది. ఇందులో సమకాలీన, సామాజిక, ఆర్థిక, మరియు రాజకీయ సమస్యలపై గాంధీ రచనలు, కవిత్వం, సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించే కథనాలు ప్రచురితమయ్యేవి. తను నెలకొల్పిన ఈ పత్రికలో గాంధీజీ ఏమని రాసుకున్నారంటే "గాంధీఇజం అంటూ ఏమీ లేదు, ఏ కొత్త సిద్ధాంతాన్ని నేను కనుగొనలేదు. ప్రపంచానికి ఒక సిద్ధాంతాన్ని ఏర్పరచే ఉద్దేశం కూడా నాకు లేదు, సత్యం, అహింస అన్నవి ఇంతకు ముందు ఉన్నవే. నేను చేసింది ఏంటంటే వాటిని ఆచరించి చూపించాను అంతే" అని. అందుకు కోర్టులో కక్షిదారుల చేత అబద్ధాలు చెప్పించాల్సి వస్తుందని, బారిష్టరు పట్టా ఉన్నప్పటికీ న్యాయవాద వృత్తినే వదులుకున్నారట. ప్రపంచం నాకు ఎదురు తిరిగినా సరే, నేను సత్యం వైపు ఒంటరిగానే ప్రయాణిస్తాను. సత్యం కోసం ఒంటరిగానే పోరాడుతాను అని అంటూ వుండేవారు గాంధీజీ. తాను తెలుసుకున్న సత్యాలను నిరంతరం పాటిస్తూ నిత్య విద్యార్థిగానే కొనసాగారు ఆయన. నా ఉద్దేశంలో అత్యంత బలహీనుడైన పౌరుడు కూడా బలవంతులతో సరి సమానంగా జీవించడమే నిజమైన ప్రజాస్వామ్యం అని చెప్పేవారు. ప్రతి సమస్యకు ప్రతీకా రమే సమాధానమైతే, ప్రపంచమంతా ఏనాడో గుడ్డిదై పోయుండేది అంటూ హింసా మార్గంలో ఉన్న అనర్థాలను సమాజానికి తెలియజెప్పారు. సత్యం చెప్పడం, సత్యం కోసం నిలబడడం అన్నిటికన్నా కష్టమైన పని, సత్యమే దైవం, అహింసయే బలమైన ఆయుధం అనేది గాంధీజీ సిద్ధాంతం. ప్రతి మనిషి అవసరాన్ని



తీర్చే శక్తి ఈ ప్రపంచానికి ఉంది. కానీ%౨% మనిషి దురాశకు మాత్రం ఈ ప్రపంచం సరిపోదు' అన్నది గాంధీ చెప్పిన విలువైన మాటల్లో ఒకటి. 1922 సంవత్సరం, ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని (గోరఖ్‌పూర్ జిల్లా) చౌరీ చౌరా అనే గ్రామంలో అక్కడి పోలీస్ స్టేషన్ ను ప్రజలు ముట్టిడించిన సందర్భంలో "అహింసాయుత పోరాటం చేయగల పరిమితిని, పరిణతిని, ఈ దేశం ఇంకా నేర్చుకోవాల్సి ఉంది" అంటూ ఉద్యమాన్ని తాత్కాలికంగా ఆపివేశారు. ఆనాటి ఈ సంఘటన గాంధీజీ నియమ, నిబద్ధతకు తార్కాణంగా నిలుస్తుంది.

కేవలం స్వాతంత్ర్యోద్యమానికి పరిమితం కాలేదు గాంధీజీ . మహిళలు, చేతివృత్తుల వారు, కార్మికులు, పిల్లలు ఇలా ప్రతి ఒక్కరి పట్ల ఆయనకు ఒక ప్రత్యేకమైన అభిప్రాయం ఉండేది. వారికీ సమాన్యాయం జరగలన్న తపనతోనే పని చేసే వారు. సందర్భం ఏదైనా సరే భారతదేశ ప్రజానీకంతో నిత్యం సంభాషించేవాడు. ఇక స్వాతంత్ర్యోద్యమం లో స్త్రీ శక్తి కూడా ప్రధానమైనది అని భావించిన గాంధీ తన భార్య అయిన కస్తూరిబాను కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేటట్లు ప్రోత్సహించారు.

దక్షిణాఫ్రికా నుంచి తిరిగొచ్చిన తర్వాత, అహ్మదాబాద్ లోని తన మిత్రుడు, బారిస్టర్ అయిన జీవన్‌లాల్ దేశాయ్‌కి చెందిన బంగ్లాలో 1915 మే 25వ తేదీన గాంధీ తన ఆశ్రమాన్ని ప్రారంభించారు. అయితే, అక్కడ వ్యవసాయం చేయటానికి, పశువులను పెంచటానికి, ఇతరత్రా కార్యక్రమాలకు సరిపడా స్థలం లేకపోవటంతో ఈ ఆశ్రమాన్ని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు సమీపంలో ఉన్న సబర్మతి నది కరకట్ట పక్కన ఉన్న స్థలంలోకి 1917, జూన్ 17వ తేదీన మార్చారు. తర్వాత అదే సబర్మతి ఆశ్రమంగా పేరొందింది. ఈ ఆశ్రమమే గాంధీజీకి స్వాతంత్ర్య సంగ్రామాన్ని ధైర్యంగా నడిపించడానికి కావలసిన స్ఫూర్తినందించింది.

ఇక ఆయన జీవనశైలి విషయానికి వస్తే అత్యంత నిరాడంబరమైన జీవితం అనే చెప్పవచ్చు. ఇల్లు, తిండి, బట్ట, ఆస్తులు ఇవేవీ గాంధీజీ సంపాదించుకోలేదు. మనకు వున్న వాటితోనే తృప్తిగా జీవించవచ్చు అని నిరూపించాడు. జీవితాంతం నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించి, సత్యానికి కట్టుబడిన మహనీయుడు. అస్పృశ్యత, స్త్రీల పట్ల వివక్ష, హిందూ ముస్లిం విభేదాలు, నిరక్షరాస్యత వంటి సమస్యలపై పోరాడారాయన. యువతను పెద్దఎత్తున స్వాతంత్రోద్యమంలోకి ఆహ్వానించాడు. సరికొత్త లక్ష్యాలతో యువత ముందుకు నడవాలని బోధించేవారు. చెడు వినవద్దు, చెడు చూడవద్దు, చెడు మాట్లాడవద్దు అనే మహాత్ముడి మాటలు ఇప్పటికీ నిత్యం ఎక్కడో ఒకచోట మన చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటాయి.

శాంతి స్థాపన కోసం ప్రజలంతా ఏకతాటిపై ఉండాలన్న ఆకాంక్షతో ప్రార్థన చేస్తూ, 1948, జనవరి 30 న ఆందోళనకారుల ఆగ్రహానికి గురై రామనామస్మరణతో నేలకొరిగిన అసాధారణ వ్యక్తి గాంధీజీ. గాంధీజీ మరణించి 75 ఏళ్లు గడచినప్పటికీ ఆయన ఆచరించిన అహింసా మార్గం సదా ఆచరణీయం. గాంధీజీ జీవితం, వారి ఆలోచనలు, బోధనలు నేటి తరానికే కాదు, రాబోయే తరాలకి కూడా స్ఫూర్తిదాయకం.

అక్టోబర్ 2 వ తేదీ)మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ



**అయాచితం ప్రమీల (పింగళి),**

**స్వతంత్ర పాత్రికేయురాలు , 9494541268**











# కోహ్లి @ 27000

## అంతర్జాతీయ క్రికెట్‌లో నాలుగో ఆటగాడిగా ఘనత

సూర్య
విజయవాడ
బుధవారం
2 అక్టోబర్ 2024



ముంబై: అంతర్జాతీయ క్రికెట్లో 27 వేల పరుగుల మైలురాయిని చేరుకున్న నాలుగో ఆటగాడిగా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. కెరీర్లో ఎన్నో చిరస్మరణీయ ప్రదర్శనలు చేసిన అతడు.. ఇప్పటివరకు 194 టెస్టు ఇన్నింగ్స్లో 8918 పరుగులు సాధించాడు. ఇందుల్లో 29 శతకాలు, 30 అర్ధశతకాలు ఉన్నాయి. కోహ్లి 295 వన్డేల్లో 50 సెంచరీలు, 72 అర్ధసెంచరీలతో 13,906 చేశాడు. అలాగే 125 టీ20ల్లో 4188 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357), సంగక్కర (28,016), పాంటింగ్ (27,483) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. కోహ్లి అతి తక్కువ ఇన్నింగ్స్లో (594) ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. సచిన్ (623)ను అతడు అధిగమించాడు.

# రెండో టెస్టు మనదే



## ● బంగ్లాపై భారత్ ఘన విజయం
## ● 2-0 తేడాతో సిరీస్ కైవసం



కాన్పూర్: రెండురోజులపాటు ఆటనే సాగలేదు. తొలి రోజు కేవలం 35 ఓవర్లే పడ్డాయి. ఇలాంటి పరిస్థితుల్లో మ్యాచ్ ఫలితం ఊహించడం కష్టమే. కానీ, భారత్ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. బంగ్లాను రెండు ఇన్నింగ్స్‌లోనూ ఆలౌట్ చేసింది. కేవలం 95 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా మూడు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ (8), గిల్ (6) విఫలమైనప్పటికీ.. యశస్వి జైస్వాల్ (51), విరాట్ కోహ్లీ (29) రాణించారు. ఈక్రమంలో మరో హాఫ్ సెంచరీని యశస్వి తన ఖాతాలో వేసుకున్నాడు. మరో మూడు పరుగులు అవసరమనగా.. యశస్వి జైస్వాల్ భారీ షాట్కు యత్నించి పెవిలియన్కు చేరాడు. ఆ తర్వాత రిషభ్ పంత్‌తో (4) కలిసి కోహ్లీ మరో వికెట్ పడనీయకుండా జట్టును విజయతీరాలకు చేర్చారు.

అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా 146 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233 పరుగులు చేయగా.. భారత్ 285/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్ను డిక్లేర్ చేసింది. దీంతో రెండు టెస్టుల సిరీస్ను భారత్ 2–0 తేడాతో కైవసం చేసుకుంది. స్వదేశంలో వరుసగా 18వ సిరీస్ను భారత్ గెలిచినట్లు అయింది. యశస్వి జైస్వాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా నిలవగా.. రవిచంద్రన్ అశ్విన్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకున్నాడు. ఈ సిరీస్ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టాప్లో ఉన్న టీమ్‌ఇండియా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. రాబోయే ఎనిమిది టెస్టుల్లో మరో మూడు గెలిచినా భారత్ టాప్–2లో ఉండి ఫైనల్కు చేరడం ఖాయం.

**రెచ్చిపోయిన యశస్వి, రాహుల్** : 3 ఓవర్లకే 50 పరుగులు.. టీ20ల్లోనే తక్కువగా కనిపించే దృశ్యమిది. 10.1 ఓవర్లలో 100.. 18.2 ఓవర్లలో 150.. 24.2 ఓవర్లలో 200.. 30.1 ఓవర్లలో 250!

స్కోరేమో రాకెట్ వేగంతో దూసుకెళ్తోంది.. టీ20 ఆడుతున్నారేమో అనుకుంటే ఆటగాళ్లు తెల్ల దుస్తుల్లో ఉన్నారు. బంతి ఎరుపు రంగులో ఉంది. ఇది టెస్టు మ్యాచే. కానీ దీన్నే టీ20లా మార్చి టీమ్‌ఇండియా బ్యాటర్లు చెలరేగిపోయారు. బంగ్లా బౌలర్లను ఊచకోత కోశారు.. రికార్డుల దుమ్ము దులిపారు!

శుక్రవారం మొదలైన మ్యాచ్లో ఆ రోజు ఆట సగం కూడా సాగలేదు. వర్షంతో శని, ఆదివారాలు ఆట తుడిచిపెట్టుకుపోయింది. మిగిలిన రెండు రోజులు ఆడినా డ్రా అవకాశాలే ఎక్కువ. కాదు గెలవాలంటే అసాధారణ ప్రదర్శన చేయాల్సిందే. బంగ్లాతో రెండో టెస్టులో భారత్ అదే చేసింది. టెస్టు ఆడుతున్నామనే సంగతి మర్చిపోయారేమో అనిపించేలా.. ఇంగ్లాండ్ బజ్బాల్ను తలదన్నేలా.. రికార్డులు గల్లంతయ్యేలా మన బ్యాటర్లు వీర విధ్వంసం సృష్టించారు. రెండు రోజుల ఆట లేదని నిరాశ పడ్డ అభిమానులకు కిక్కు అందిస్తూ.. రోహిత్ సేన అదరగొట్టింది. 285/9కే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి.. ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. చివరి రోజైన మంగళవారం భారత్ ఇదే ప్రదర్శన కొనసాగిస్తే గెలుపు పక్కా!

కాన్పూర్‌జి

ఒక్క రోజులో ఎంత ఊపు. టెస్టు క్రికెట్లో కిక్కిచ్చే మజా. బంగ్లాదేశ్తో డ్రాగా ముగిసేలా కనిపించిన రెండో టెస్టులో భారత్ గెలుపు అవకాశాలు సృష్టించుకుంది. ప్రత్యర్థిని త్వరగా ఆలౌట్ చేసి.. ఆపై విధ్వంసక బ్యాటింగ్తో ఆధిక్యం సంపాదించి.. మరోసారి బంగ్లా పనిపట్టే దిశగా టీమ్‌ఇండియా సాగుతోంది. సోమవారం ఆట చివరకు రెండో ఇన్నింగ్స్లో బంగ్లా 26/2తో నిలిచింది. ఆ జట్టు ఇంకా 26 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు భారత్కు 52 పరుగుల ఆధిక్యం దక్కింది. టీమ్‌ఇండియా కేవలం 34.4 ఓవర్లలోనే 285/9 స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. 8.22 రన్రేట్తో ఈ పరుగులు సాధించడం విశేషం. యశస్వి జైస్వాల్ (72బీ 51 బంతుల్లో 12ఐ4, 2ఐ6), కేఎల్ రాహుల్ (68బీ 43 బంతుల్లో 7ఐ4, 2ఐ6), కోహ్లి (47బీ 35 బంతుల్లో 4ఐ4, 1ఐ6) టీ20 తరహాలో రెచ్చిపోయారు. ప్రత్యర్థి స్పిన్నర్లు మెహిదీ హసన్ (4/41), షకిబ్ అల్ హసన్ (4/78) మెరిశారు. నాలుగో రోజు ఉదయం ఓవర్నైట్ స్కోరు 107/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 233 పరుగులకు ఆలౌటైంది. మొమినుల్ హక్ (107 నాటౌట్‌బీ 194 బంతుల్లో 17ఐ4, 1ఐ6) అజేయ శతకంతో పోరాడాడు. బుమ్రా (3/50), సిరాజ్ (2/57), అశ్విన్ (2/45), ఆకాశ్ దీప్ (2/43) రాణించారు.



ఏమా బాదుడు!: గ్రీన్పార్క్ స్టేడియంలో శని, ఆదివారాల్లో వర్షం పడింది. సోమవారం మాత్రం సునామీ వచ్చింది. ఇది సముద్రంలో రేగిన అలజడి కాదు.. మైదానంలో భారత బ్యాటర్ల ఊచకోతకు ఫలితం. చూస్తుండగానే స్కోరు 50, 100, 150, 200, 250 దాటిపోయింది.

ఈ బాదుడుకు శ్రీకారం చుట్టింది మాత్రం జైస్వాల్. తొలి ఓవర్లోనే హ్యాట్రిక్ ఫోర్లతో దంచుడు మొదలెట్టాడు. మరో ఎండ్లో రోహిత్ కూడా తగ్గలేదు. వరుసగా రెండు సిక్సర్లతో పరుగుల వేట ఆరంభించాడు. 3 ఓవర్లకే స్కోరు 50. ఈ జోరుకు కళ్లెం వేసేందుకు బంగ్లా స్పిన్నర్ను దించింది. తొలి 7 బంతుల్లో 23 పరుగులు చేసిన రోహిత్.. మెహిదీ వేసిన బంతి తక్కువ ఎత్తులో వచ్చి స్టంప్స్ను లేపేయడంతో పెవిలియన్ చేరాల్సి వచ్చింది. వికెట్ పడ్డా ఇన్నింగ్స్ వేగం ఏ మాత్రం తగ్గలేదు. శుభ్మన్ (39)తో కలిసి జైస్వాల్ బౌండరీలకు గురిపెట్టాడు. 31 బంతుల్లోనే అతను అర్ధశతకం పూర్తిచేశాడు. స్వీప్, రివర్స్ స్వీప్, లాఫ్టెడ్, కట్, డ్రైవ్.. ఇలా మైదానంలో అన్నివైపులా జైస్వాల్ షాట్లు కొట్టాడు. 11వ ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటింది. కానీ శతకం దిశగా సాగుతున్న జైస్వాల్ తక్కువ ఎత్తులో వచ్చిన బంతికి బౌల్డయ్యాడు. వేగం కొనసాగించడానికి కోహ్లి కంటే ముందే బ్యాటింగ్కు వచ్చిన పంత్ (9) విఫలమవడం, శుభ్మన్ నెమ్మదించడంతో జోరు కాస్త తగ్గింది.

ఆ ఇద్దరు కలిసి..: టీ విరామం తర్వాత శుభ్మన్, పంత్ను షకిబ్ వరుస ఓవర్లలో ఔట్ చేయడంతో భారత్కు బ్రేక్ వేశామని బంగ్లా సంతోషపడే ఉంటుంది. కానీ కోహ్లి, రాహుల్ కలిసి ప్రత్యర్థికి ఆ అవకాశమే ఇవ్వలేదు. బౌలర్ ఎవరైనా సరే బాదడమే లక్ష్యంగా ఈ జోడీ బ్యాటింగ్ కొనసాగించింది. ఆరంభంలో రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకున్న కోహ్లి.. తైజుల్ బౌలింగ్లో చూడముచ్చటైన సిక్సర్ కొట్టాడు. మరో ఎండ్లో రాహుల్ నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. స్పిన్నర్లను వీళ్లు ఊద్చేశారు. 28వ ఓవర్లోనే భారత్ ఆధిక్యం సంపాదించింది. రాహుల్ 33 బంతుల్లోనే అర్ధశతకం చేరుకున్నాడు. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు షకిబ్, మెహిదీ భారత్ను దెబ్బకొట్టారు. అర్ధశతకం ముంగిట కోహ్లీని బౌల్డ్ చేసిన షకిబ్.. 87 పరుగుల (59 బంతుల్లో) అయిదో వికెట్ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. అక్కడి నుంచి వరుసగా వికెట్లు పడ్డాయి. రాహుల్, రెండు సిక్సర్లు కొట్టిన ఆకాశ్ దీప్ (12)ను మెహిదీ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. మిగిలిన ఓవర్లలో వికెట్లు పడగొట్టి బంగ్లాను ఒత్తిడిలోకి నెట్టేందుకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్ అనుకున్న ఫలితాన్ని పొందింది. రెండో ఇన్నింగ్స్లో వరుస ఓవర్లలో జాకిర్ (10), హసన్ (4)లను అశ్విన్ (2/14) ఔట్ చేశాడు. షాద్మన్ (7 బ్యాటింగ్), మొమినుల్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

అతని పోరాటం: అంతకుముందు వర్షం కారణంగా రెండు రోజుల విరామం తర్వాత తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ను భారత బౌలర్లు హడలెత్తించారు. మొమినుల్ (ఓవర్నైట్ స్కోరు 40), ముష్ఫికర్ రహీం (ఓవర్నైట్ స్కోరు 6)ను ఓ వైపు నుంచి బుమ్రా, మరో ఎండ్ నుంచి ఆకాశ్దీప్ భయపెట్టారు. ఓ అద్భుతమైన ఇన్స్వింగర్తో ముష్ఫికర్ (11)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. ఈ దశలో మొమినుల్ పట్టుదలతో నిలబడ్డాడు. కానీ రోహిత్, సిరాజ్ పట్టిన సూపర్ క్యాచ్లకు వరుసగా లిటన్ (13), షకిబ్ (9) పెవిలియన్ చేరడంతో బంగ్లా 170/6తో కష్టాల్లో పడింది. తర్వాత మెహిదీ (20) జతగా మొమినుల్ పోరాటం కొనసాగించాడు. లంచ్ తర్వాత 28 పరుగుల వ్యవధిలోనే బంగ్లా ఇన్నింగ్స్కు తెరపడింది. బుమ్రా.. వరుస ఓవర్లలో



మెహిదీ, తైజుల్ (5)ను ఔట్ చేశాడు. చివరి బ్యాటర్ ఖలెద్ (0)ను పెవిలియన్ చేర్చిన జడేజా (1/28) 300వ టెస్టు వికెట్ను ఖాతాలో వేసుకున్నాడు.

3టెస్టుల్లో 3000 పరుగులు, 300 వికెట్లు సాధించిన భారత ఆటగాళ్లలో జడేజా స్థానం. కపిల్ దేవ్, అశ్విన్ ముందున్నారు. ఓవరాల్గా ప్రపంచ క్రికెట్లో జడేజాది 11వ స్థానం. మ్యాచ్ల పరంగా అత్యంత వేగంగా ఈ ఘనత అందుకున్న ఆటగాళ్లలో ఇయాన్ బోథం (72) తర్వాత రెండో స్థానంలో జడేజా (74) ఉన్నాడు.

**వాహ్.. వాహ్ :** బంగ్లా తొలి ఇన్నింగ్స్లో రోహిత్, సిరాజ్ ఒంటిచేత్తో అద్భుతమైన క్యాచ్లు అందుకున్నారు. సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ 50వ ఓవర్ నాలుగో బంతిని ఆడేందుకు ముందుకు వచ్చిన లిటన్.. మిడాఫ్ మీదుగా షాట్ కొట్టాడు. కానీ మిడాఫ్లో ఉన్న రోహిత్ టక్కున ఎగిరి తనను దాటి వెళ్లిపోతున్నట్లు కనిపించిన బంతిని కుడి చేత్తో పట్టుకున్నాడు. లిటన్ నమ్మశక్యం కానట్లు పెవిలియన్ బాట పట్టాడు. 37 ఏళ్ల వయసులో మెరుపు వేగంతో స్పందించి క్యాచ్ అందుకున్న రోహిత్ తన ఫిట్నెస్పై ప్రశ్నలకు మరోసారి అదిరే సమాధానమిచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే అశ్విన్ (ఇన్నింగ్స్ 56వ) బౌలింగ్లో బ్యాట్పై నియంత్రణ కోల్పోయిన షకిబ్ చివరి బంతిని గాల్లోకి లేపాడు. ఎండ బాగా కాస్తుండటంతో గాల్లోకి ఎగిరిన బంతిని అంచనా వేయడం ఇబ్బంది అయినప్పటికీ.. మిడాఫ్ నుంచి వెనక్కి పరిగెడుతూ సిరాజ్ సంచలన క్యాచ్ అందుకున్నాడు. చివరి క్షణాల్లో గాల్లో వెనక్కి ఎగిరి.. కింద పడుతూ.. ఎడమ చేతి వేళ్లతో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. అయితే ఫీల్డింగ్లో భారత్ కొన్ని అవకాశాలూ చేజార్చింది. బంగ్లా తొలి ఇన్నింగ్స్లో పంత్, కోహ్లి.. రెండో ఇన్నింగ్స్లో కేఎల్ రాహుల్ క్యాచ్లు పట్టలేకపోయారు.

# కాన్పూర్ పిచ్‌ను చూస్తే షమీ గుర్తుకొస్తాడు..



## త్వరలోనే ఫామ్‌లోకి వచ్చేస్తాడు : రవిశాస్త్రి

కాన్పూర్: భారత్ – బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టుకు కాన్పూర్ వేదికనే సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్కు కామెంటేటర్గా భారత మాజీ క్రికెటర్, మాజీ కోచ్ రవిశాస్త్రి వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ పేరును రవిశాస్త్రి ప్రస్తావించాడు. గత వన్డే ప్రపంచకప్ తర్వాత గాయానికి శస్త్రచికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకున్న షమీ... మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. త్వరలో దేశవాళీ క్రికెట్ ఆడనున్నాడు. నవంబర్లో ఆసీస్ పర్యటనకు వెళ్లేలా ఫిట్నెస్, ఫామ్పై దృష్టిపెట్టాడు. కాన్పూర్ పిచ్ను చూస్తుంటే షమీ గుర్తుకొచ్చాడని.. ఇక్కడ అతడు చాలా మ్యాచ్లు ఆడినట్లు రవిశాస్త్రి పేర్కొన్నాడు.

బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో బుమ్రాతోపాటు షమీ కీలకపాత్ర పోషిస్తాడని తెలిపాడు.

"ప్రపంచ క్రికెట్లో షమీ వంటి పేస్ను సంధించే బౌలర్లు చాలా అరుదు. చాలాకాలంగా అతడు బౌలింగ్ చేస్తున్నాడు. త్వరలోనే అతడు పూర్తిస్థాయిలో కోలుకొని జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నా. ఇప్పటికీ భారత క్రికెట్లో షమీ కీలకపాత్ర పోషించగలడు. గత వన్డే ప్రపంచకప్లో అతడి బౌలింగ్ను ప్రపంచమంతా చూసింది. పరిమిత ఓవర్ల క్రికెట్లోనూ తన సత్తా ఏంటో నిరూపించాడు. కాన్పూర్ పిచ్పై బంతి రివర్స్ అవుతుంది. ఇలాంటి దానిపై షమీ మరింత ప్రమాదకరమవుతాడు. అంతేకాక కాన్పూర్లో చాలా క్రికెట్ ఆడాడు. జెన్యూన్ వికెట్ టేకర్ కమ్ విన్నింగ్ బౌలర్" అని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు.

షమీ రికార్డులు అద్భుతం: దినేశ్ కార్తిక్

షమీ బౌలింగ్పై రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలను మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సమర్థించాడు. బుమ్రాతో కలిసి షమీని ఎదుర్కోవడం ఎంతటి బ్యాటర్కైనా కష్టమేనని పేర్కొన్నాడు. "షమీ రికార్డులు అద్భుతం. భారత క్రికెట్ కోసం అతడు చేసిన వాటిని ఎప్పటికీ మరిచిపోలేం. జస్ప్రీత్ బుమ్రాతో కలిసి పేస్ దాడిని షమీ కొనసాగిస్తే ప్రత్యర్థులు హడలెత్తిపోవాల్సిందే. అతడి గణాంకాలే చెబుతాయి" అని దినేశ్ కార్తిక్ తెలిపాడు. షమీ లేకపోవడంతో బుమ్రా, సిరాజ్తో కలిసి పేస్ దళంలో ఆకాశ్ దీప్ చోటు దక్కించుకున్నాడు. ఈ సిరీస్లో అతడూ మంచి ప్రదర్శనే చేశాడు.

# ఆస్ట్రేలియా టెస్ట్ సిరీస్‌లో రుతురాజ్?

## మూడో ఓపెనర్‌గా తీసుకునే అవకాశం

ముంబై: దేశవాళీ క్రికెట్లో మంచి ప్రదర్శన చేసినప్పటికీ భారత యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ బంగ్లాదేశ్తో జరగనున్న టీ20 సిరీస్కు జట్టులో చోటు దక్కని విషయం తెలిసిందే. దీంతో సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ, సెలక్షన్ కమిటీపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి.

ఈనేపథ్యంలో భారత జట్టు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ రుతురాజ్ విషయంలో పెద్ద ప్రణాళికతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది ఆస్ట్రేలియాతో జరగనున్న ఐదు మ్యాచ్ల టెస్ట్ సిరీస్కి గైక్వాడ్ని మూడో ఓపెనర్గా తీసుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

'ఓపెనర్లుగా ఉన్న యశస్వి జైస్వాల్, శుభ్మన్ గిల్కి బంగ్లాదేశ్ టీ20 సిరీస్కి విశ్రాంతి ఇచ్చినప్పటికీ గైక్వాడ్ని ఎంపిక చేయలేదనే విషయంలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. భారత జట్టు మేనేజ్మెంట్, సెలక్టర్లు అతడిని ఆస్ట్రేలియా సిరీస్లో మూడో ఓపెనర్గా ఆడించాలనే ఆలోచనతో ఉన్నారు. సుదీర్ఘ ఫార్మాట్లో రాణించాలంటే ఫిట్గా ఉండాల్సిన అవసరం ఉంది.

అందుకే బంగ్లా టీ20కి ఎంపిక చేయలేదు. ఇరానీ కప్లో మంచి ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నారు' అని విశ్వసనీయవర్గం తెలిపింది. అయితే ఈ నెలలో స్వదేశంలో న్యూజిలాండ్తో జరగనున్న టెస్ట్ సిరీస్లోను అతడిని తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ఇదిలాఉండగా, ఐపీఎల్ 2024లో చెన్నై సూపర్కింగ్స్కు కెప్టెన్గా వ్యవహరించిన రుతురాజ్.. తన కెరీర్లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా టెస్ట్ మ్యాచ్లకు ఎంపికయ్యాడు. కానీ అక్కడ అంతగా ఆకట్టుకోలేకపోయాడు.


ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్కు అందుబాటులో ఉంటాడనుకున్నప్పటికీ వ్యక్తిగత కారణాల వల్ల జట్టు నుంచి వైదొలిగాడు. దీంతో అతడి స్థానంలో యశస్వి జైస్వాల్ని తీసుకున్నారు. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో ఇండియా సి జట్టుకి నాయకత్వం వహించిన విషయం తెలిసిందే.



## రేపటి నుంచి మహిళల

# టీ20 ప్రపంచకప్

● యూఏఈ వేదికగా మహిళల ధనాధన్ ● ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్ జట్టుగా బరిలోకి ● ఆరుసార్లు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా ● 2020లో తొలిసారి టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్



అబుదాబీః టీ20 ప్రపంచకప్లో టీమ్‌ఇండియా విజయంతో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. కొన్ని నెలల పాటు ఆ కిక్కు కొనసాగింది. ఇప్పుడు అమ్మాయిల ధనాధన్కు రంగం సిద్ధమైంది. మహిళల టీ20 ప్రపంచకప్ గురువారమే ఆరంభం కాబోతోంది. గత కొన్నేళ్లలో బాగా వేగం పుంజుకుని ఆకర్షణీయంగా మారిన మహిళల క్రికెట్.. అభిమానుల దృష్టిని బాగానే ఆకర్షిస్తోంది. ముఖ్యంగా అమ్మాయిలు టీ20ల్లో తలపడితే స్టేడియాలు నిండిపోతున్నాయి. టీవీ సెట్ల ముందు కూడా సందడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో యూఈఏ వేదికగా గురువారం మొదలయ్యే పొట్టి కప్పు మీదా అభిమానులు అమితాసక్తి ప్రదర్శిస్తారనడంలో సందేహం లేదు. ఇప్పటిదాకా ఏ ఫార్మాట్లోనూ ప్రపంచకప్ సాధించలేకపోయిన భారత మహిళల జట్టు.. ఈసారి ఎలాగైనా కల నెరవేర్చుకోవాలనుకుంటోంది. 2020లో తొలిసారి టీ20 ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత్.. ఆస్ట్రేలియా చేతిలో పరాజయం చవిచూసింది. తమ దేశ పురుషుల జట్టును మించి క్రికెట్లో ఆధిపత్యం చలాయిస్తున్న ఆస్ట్రేలియా.. ఆరుసార్లు విజేతగా నిలవడం విశేషం. మరోసారి ఆ జట్టు ఫేవరెట్గా బరిలోకి దిగుతోంది. కానీ మునుపెన్నడూ లేనంత బలంగా, ఆల్రౌండ్ నైపుణ్యంతో కనిపిస్తున్న భారత జట్టు స్థాయికి తగ్గ ప్రదర్శన చేసే కప్పు గెలిచే అవకాశముంది. ఇంకా ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు కూడా టైటిల్ ఫేవరెట్లే.

ఇప్పటిదాకా జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్లు 8. ఆస్ట్రేలియా ఆరుసార్లు (2010, 2012, 2014, 2018, 2020, 2023) విజేతగా నిలిచింది. ఇంగ్లాండ్ (2009), వెస్టిండీస్ (2016) ఒక్కో టైటిల్ సాధించాయి.

టోర్నీలో 10 జట్లు పోటీ పడుతున్నాయి. అయిదేసి జట్లు రెండు గ్రూప్లుగా విడిపోయి మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. రెండు గ్రూప్ల నుంచి లీగ్ దశలో టాప్–2 జట్లు సెమీస్కు వెళ్తాయి.టోర్నీకి దుబాయ్, షార్జా మైదానాలు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ నెల 20న దుబాయ్లో ఫైనల్ జరుగుతుంది.


గ్రూప్–ఎలో ఉన్న భారత్, పాకిస్థాన్ ఈ నెల 6న తలపడతాయి.

# నవంబర్ 14న 'మట్కా'



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హైలీ యాంటిసిపేటెడ్ పీరియడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా' షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం, టీమ్ వరుణ్ తేజ్, ఫైటర్స్‌తో కూడిన చాలా కీలకమైన, ఇంటెన్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తోంది. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న 'మట్కా' వరుణ్ తేజ్‌కి మోస్ట్ హై బడ్జెట్ మూవీ. ప్రొడక్షన్ చివరి దశలో వుండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంగా జరగడంతో 'మట్కా' మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రం కార్తీక పూర్ణిమకు ముందుగా నవంబర్ 14న థియేటర్లలోకి రానుంది, సినిమాకి లాంగ్ వీకెండ్ అడ్వాంటేజ్ వుంటుంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అదరగొట్టిన మేకర్స్ సెకండ్ లుక్ రిలీజ్ చేశారు. వరుణ్ తేజ్ పోస్టర్‌లో రెట్రో అవతార్, సూట్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లపై నడుస్తున్న పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో "దీక్ష"




ఆర్.కె. ఫిలింస్, స్నిగ్ధ క్రియేషన్స్ బ్యానర్స్‌పై ప్రముఖ దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'దీక్ష'. పినిశెట్టి అశోక్ కుమార్, ఆర్ కె. గౌడ్ నిర్మాతలు. కిరణ్‌కుమార్, అలేఖ్యరెడ్డి జంటగా నటిస్తున్నారు. తాజాగా జరిగిన కార్యక్రమంలో ఈ చిత్ర ప్రోగ్రెస్ ను తెలిపారు దర్శక నిర్మాత ఆర్ కే గౌడ్. ఈ సందర్భంగా దర్శక నిర్మాత ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ – మా 'దీక్ష' సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, గ్రాఫిక్ వర్క్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో 5 పాటలున్నాయి. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన మ్యూజిక్ అందించారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా. ఆక్సఖాన్ స్పెషల్ సాంగ్ లో అద్భుతమైన డాన్స్ చేసింది. జె వి ఆర్ మంచి క్యారెక్టర్ లో నటించారు. "దీక్ష" ఉంటే ఏదైనా సాధించగలం అనే పాయింట్ తో మూవీని తెరకెక్కించాం. ఈ పాయింట్ ప్రతి ఒక్క ప్రేక్షకుడికీ కనెక్ట్ అవుతుంది. ఎందుకంటే మన లైఫ్ లో కూడా ఏదో ఒకటి సాధించాలనే తపనతోనే ఉంటాయి. ఈ మూవీలో హీరో కిరణ్ పర్ ఫార్మెన్స్ ఆకట్టుకుంటుంది. ఆయనకు హీరోగా మంచి పేరు తెచ్చే చిత్రమిది. మా ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ వెనకుండి మమ్మల్ని నడిపిస్తున్నారు. ఆయనకు థ్యాంక్స్ చెబుతున్నాఅన్నారు.



# 'గేమ్ చేంజర్'లో రామ్ చరణ్ ని సరికొత్తగా చూస్తారు: డైరెక్టర్ శంకర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీమతి అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తోన్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్. 2024 క్రిస్మస్ సందర్భంగా సినిమాను తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'రా మచ్చా మచ్చా..' సాంగ్‌ను సెయింట్ మార్టిన్స్ కాలేజ్‌లో స్టూడెంట్స్ సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా.. స్టార్ డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ "నేను డైరెక్ట్ చేసిన ప్రతీ సినిమాను తెలుగు ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. అలాంటి ప్రేక్షకుల కోసం ఓ స్ట్రయిట్ మూవీ చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటు న్నాను. ఇప్పుడు 'గేమ్ చేంజర్' రూపంలో అది నేరవేరు తుంది. దిల్‌రాజు, శిరీష్‌గారి నిర్మాతలుగా ఈ మూవీ తెరకె క్కుతుంది. పక్కా తెలుగు సినిమాలా ప్రతి విషయంలో కేర్ తీసుకుని ఎంతో జాగ్రత్తగా దీన్ని తెరకెక్కించాను. సాంగ్స్ విషయానికి వస్తే నేను హీరో ఇంట్రడక్షన్ సాంగ్ ఏ సినిమాలోనూ చేయలేదు. కానీ తొలిసారి 'గేమ్ చేంజర్'లో అలాంటి హీరో ఇంట్రోసాంగ్ చేశాను. తెలుగు సంస్కృతిని చూపించటానికి 1000 మంది జానపద కళకారులతో పాటను చిత్రీకరించాం. తమన్‌గారు రెండు రోజులు అన్నీ ట్యూన్స్‌ను రికార్డ్ చేసి ఈ పాటను తమన్ చేయటం విశేషం. రామ్ చరణ్‌ని సరికొత్తగా డిఫరెంట్ డైమన్షన్స్‌లో చూడొచ్చు. ఆయన మంచి డాన్సర్. పెర్ఫామర్. ఆ సాంగ్‌లో అద్భుతంగా డాన్స్ చేశారు. ఈ సాంగ్‌లో ఒక నిమిషం పాటు వచ్చే బీజీఎంను ఆయన సింగిల్ టేక్ డాన్స్‌తో పూర్తి చేశారు. మేకర్స్ అన్‌కాంప్రమైజ్డ్‌గా సినిమాను నిర్మించారు. దిల్‌రాజు, శిరీష్‌గారికి స్పెషల్ థాంక్స్. శ్రీకాంత్ ఫస్ట్ టైమ్ ఓ డిఫరెంట్ రోల్‌లో కనిపిస్తారు. ఎస్.జె.సూర్య నట రాక్షసుడు. చరణ్, సూర్య మధ్య సన్నివేశాలను ఎంతో బాగా ఎంజాయ్ చేస్తారు. అనంత్ శ్రీరామ్ పాటను అద్భుతంగా రాశారు. ఈ పాటను రేపు స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు నోస్టాలజిక్ ఫీలింగ్ వస్తుంది" అన్నారు.

# 'శ్వాగ్' ఇంటిల్లిపాది చూడదగ్గ సినిమా – హీరో శ్రీవిష్ణు



కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి అప్ కమింగ్ హిలేరియస్ ఎంటర్ టైనర్ 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. శ్వాగ్ అక్టోబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో శ్రీవిష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**శ్వాగ్ సినిమా గురించి, ఇందులో మీ రాజ్యం గురించి చెప్పండి ?**

శ్వాగ్.. అంటే శ్వాగనిక వంశానికి సుస్వాగతం. అంత పెద్ద టైటిల్ ని పలకడానికి ఇబ్బందిగా ఉంటుందని షార్ట్ గా 'శ్వాగ్' అని టైటిల్ పెట్టాం.

శ్వాగ్ ఒక వంశానికి సంబధించిన కథ. మాత్రు, పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 1500 సంవంత్సవంలో మొదలయ్యే కథ. మగ గొప్పా ? ఆడ గొప్పా ? అనే అంశంపై చిన్న టిట్ ఫర్ టాట్ లాంటి కథ. తెలుగు ప్రేక్షకులు కొత్త కథ ఎప్పుడు చెప్పినా ఆదరించారు. అదే ధైర్యంతో ఈ సినిమా చేయడం జరిగింది.

నేను ఎప్పుడూ డ్యుయల్ రోల్స్ చేయలేదు. ఇందులో నాలుగు పాత్రలు చేశాను. అందరూ ఒకే పోలికతో వుండే ఒకే వంశస్తులే. నాలుగు పాత్రలు వున్నప్పుడు ఎలా చేయాలనేది ఛాలెంజ్ గా అనిపించింది. వన్స్ గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక.. చాలా బాగా కుదిరింది. సినిమా చాలా బావొచ్చింది. ఇంటిల్లిపాది చూడదగ్గ సినిమా ఇది. పెద్దవాళ్ళకి సినిమా విపరీతంగా నచ్చుతుంది. అలాగే యంగ్ ఆడియన్స్ కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ సినిమాలో వున్నాయి. సినిమా చూసి పేరెంట్స్‌ని కూడా సినిమాకి తీసుకువెళ్తారు. ఈ జనరేషన్ తెలుసుకోవాల్సిన చాలా విషయాలు ఇందులో వున్నాయి. మన వంశం గురించి, పెద్దల గురించి, తాతల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏమిటనేది ఇందులో చాలా చక్కగా చూపించడం జరిగింది.

చాలా పెద్ద కథ ఇది. రెండున్న గంటల్లో ఇంత పెద్ద కథ చెప్పారా అని సినిమా చూసిన తర్వాత దర్శకుడిని ప్రేక్షకులు అభినందిస్తారు. కథలో బాగంగానే ఎంటర్‌టైన్మెంట్ వుంటుంది. అందరి ఆడియన్స్‌కి ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది. నా కెరీర్ లో ఈ సినిమా వన్ ఆఫ్ ది టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం వుంది.

**శ్వాగ్ టైటిల్ లో డాగ్స్ కనిపిస్తాయి.. దాని గురించి చెప్పండి ?**

శ్వాగనిక వంశ రాజులు సింహాసనాలపై కూర్చుకున్నప్పుడు పక్కన డాగ్స్ ని పెట్టుకుంటారు. డాగ్స్ ని గుంపులు వేసుకొని వస్తుంటారు. అదొక సింబాలిక్ గా టైటిల్ లో పెట్టాం. ఇందులో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ క్యారెక్టర్ లో చాలా మంచి ట్రాన్స్ ఫర్మేషన్ వుంటుంది. ఈ సినిమా చూసాక ఆడవాళ్ళని ఒక మెట్టు ఎక్కువ అభిమానం, గౌరవంతో చూస్తాం. భవభూతి క్యారెక్టర్ ని కూడా సినిమా పూర్తయిన తర్వాత ఆడవాళ్ళు అందరూ చాలా ఇష్టపడతారు. ఈ సినిమా చూసినప్పుడు నటులు కాకుండా పాత్రలే గుర్తుంటాయి.


**'శ్వాగ్' లో నాలుగు తరాలని చూపించారు కదా? స్క్రీన్ ప్లే ఎలా వుంటుంది ?**

ఒక కుటుంబం కథ చెప్పినప్పుడు స్క్రీన్ ప్లే అందరికీ అర్ధమేయ్యేలా వుండాలి. ఎలాంటి కన్ఫ్యూజన్ వుండకూడదు. శ్వాగ్ లో స్క్రీన్ ప్లే అందరికీ అర్ధమయ్యేలా చాలా ఎంగేజింగ్ గా వుంటుంది. సింపుల్ గా వుంటునే చాలా కొత్తగా వుంటుంది.

మీరా జాస్మిన్ క్యారెక్టర్ గురించి ?

మీరా జాస్మిన్ చాలా అద్భుతంగా చేశారు. 90లో మదర్ లాంటి క్యారెక్టర్. ఆ క్యారెక్టర్ ని చూసినప్పుడు అందరి మదర్స్ గుర్తుకు వస్తారు. ఆ పాత్ర చాలా హుందాగా హెూమ్లీ గా వుంటుంది.

# "రామ్ నగర్ బన్నీ" ప్రీ రిలీజ్



ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ హీరోగా నటిస్తున్న సినిమా "రామ్ నగర్ బన్నీ". విస్మయ శ్రీ , రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 4వ తేదీన "రామ్ నగర్ బన్నీ" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో చంద్రహాస్ మాట్లాడుతూ – మా "రామ్ నగర్ బన్నీ" సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు గెస్ట్‌గా వచ్చిన రామ్‌గోపాల్‌వర్మకి థ్యాంక్స్. నాకు హీరోకు ఉండాల్సిన క్వాలిటీస్ ఉన్నాయని ఆయన చెప్పడం చాలా సంతోషంగా ఉంది. నాన్న ప్రభాకర్ ఇందాక చెప్పినట్లు ఆయనకు ఎంతమంది సపోర్ట్ చేశారో, అవసరం పడితే నేనూ వాళ్లందరి కోసం పరుగులు పెడుతూ వెళ్తాను. ఈ సందర్భంగా మూడు ప్రామిస్‌లు చేస్తున్నా. నేను మాట ఇస్తే తప్పను. నా "రామ్ నగర్ బన్నీ" సినిమా లాభాల్లో 10 శాతం ప్రజలకు ఛారిటీ కోసం ఇచ్చేస్తా. సినిమా చూసి ఆటిట్యూట్ స్టార్ అనే ట్యాగ్ కు నేను అర్హుడిని కాదంటే నా తరువాత రెండు సినిమాలకు ఆ పేరు పెట్టుకోను. అలాగే మీరు మా "రామ్ నగర్ బన్నీ" సినిమా చూసి మీకు నచ్చకుంటే నాకు మీ టికెట్ ఫొటోతో ఇన్ స్టా ద్వారా చెప్పండి మీ డబ్బులు కంపల్సరీ గూగుల్ పే చేస్తా. ఎంతమంది పంపింతే అంతమందికి డబ్బులు రిటర్న్ ఇస్తా. మిమ్మల్ని ఎప్పుడూ ఎంటర్ టైన్ చేస్తూనే ఉంటా. "రామ్ నగర్ బన్నీ" సినిమాను నేనంటే నచ్చేవాళ్లతో పాటు నచ్చనివాళ్లు కూడా చూడండి అన్నారు.

# స్టార్ హీరోతో రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కెరీర్ బాలీవుడ్ లో జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. వచ్చిన ఏ అవకాశాన్ని అమ్మడు విడిచి పెట్టడం లేదు. రానిరానీ అంటూ కొత్త చిత్రాలకు సంతకాలు మీద సంతకాలు చేస్తూనే ఉంది. అకౌంట్ కోట్ల రూపాయల పారితోషికం జమ చేస్తుంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో హిందీలో మూడు, నాలుగు రెడీగా ఉన్న సంగతి తెలిసిందే. అందులో ఒకటి స్టార్ హీరో సల్మాన్ ఖాన్ సరసన నటిస్తోన్న సికందర్. మురగదాస్ దర్శకత్వం వహిస్తోన్న హై.-ఆక్టేన్ యాక్షన్ ఎంటర్ ఎంటర్ టైన్ మెంట్ పై ఎలాంటి అంచనాలున్నాయో చెప్పాల్సిన పనిలేదు. ఇందులో రష్మిక తన్నకన్నా వయసులో బాగా పెద్దైవాడైన సల్మాన్ తోనే రొమాన్స్ చేస్తుంది. ఎప్పుడూ రొమాన్స్ జోలికి వేళ్ళని మురగదాస్ సైతం ఈసారి సల్మాన్ -రష్మిక మధ్య కొన్ని క్లోజ్ సన్నివేశాలు రాసినట్లు ఇప్పటికే ప్రచారంలో ఉంది. అయితే ఈ సినిమాతో రష్మిక కాస్త ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల అకాల వర్షాల కారణంగా షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారం జరగలేదట. సెప్టెంబర్ లో భారీ వర్షపాతం నమోదవ్వడంతో షూటింగ్ కొన్ని రోజుల పాటు పాజ్ చేసారని సమాచారం. తొలి రెండు రోజులు సెట్స్ కి వెళ్లి తిరిగి వచ్చేయవల్సిన పరిస్థితులు. దీంతో ఆమరుసటి ఉదయం 7 గంటలకే పనిమొదలు పెట్టాల్సి రావడంతో ఉదాయాన్నే షూటింగ్ అనే సరికి రష్మిక అసౌకర్యానికి గురైందట. గుర్ గావ్ లోని ఎస్ పీ ఆర్ ఎఫ్ గ్రౌండ్ లో కొన్ని సన్నివేశాలు షూట్ చేయాల్సి ఉండగా వర్షం కారణంగా గ్రౌండ్ అంతా నీట మునగడంతో ఇలాంటి పరిస్థితులు ఎదురైనట్లు యూనిట్ చెబుతుంది.

# పాండే బ్యూటీ కండీషన్లు



ఐటం పాటలకు ఏ నటి ఒకే చెప్పినా? పెద్దగా కండీషన్లు అంటూ ఏవీ లేకుండానే నటిస్తున్నారు. ఐటం పాట అంటేనే యువతలో ఊపు తెచ్చేది. ఆపాటని కమర్శియల్ కోణంలో డిజైన్ చేసి సినిమాల్లో పెడుతుంటారు. ఆ పాట కోసం స్టోరీ డిమాండ్ చేయాల్సిన పనిలేదు. సన్నివేశానికి నాన్ సింక్ అవుతుంది? అనే అవసరం లేదు. కమర్శియల్ సినిమా అయినా..పీరియాడిక్ స్టోరీ అయినా హాట్ బ్యూటీతో ఐటం పాట అన్నది? ఓ స్పెషల్‌గా భావిస్తారంతా. ఈ కల్చర్ దాదాపు అన్ని భాషల్లోనూ ఉంది. ముఖ్యంగా టాలీవుడ్..బాలీవుడ్..కోలీవుడ్లో కనిపిస్తుం టుంది. ఐటం పాటల్లో స్టార్ హీరోయిన్లే నటిస్తున్నారు. ఎలాంటి కండీషన్లు పెట్టకుండా అందాలు ఆరబోస్తున్నారు. హీరోయిన్లు ఇలాంటి టర్నింగ్ తీసుకోవడంతో ప్రొఫెషనల్ ఐటం గాల్స్‌కి డిమాండ్ తగ్గిందన్నది వాస్తవం. ఫాంలో ఉన్నా లేకపోయినా? మంచి పారితోషికం వస్తుందంటే నో చెప్పకుండా పనిచేస్తు న్నారు. తాజాగా లైగర్ బ్యూటీ అనన్యా పాండే కూడా ఐటం పాటలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది. అయితే అమ్మడు ఇక్కడ కండీషన్లు అప్లై అంటోంది. అన్ని సినిమాల్లోనూ ఐటం పాటల్లో నటించనని...కేవలం ఐటం పాటలు డిమాండ్ చేసే సినిమాలు తప్ప! మిగతా సినిమాల్లో అవకాశాలు వచ్చిన అలాంటి పాటలు చేయనంటోంది.పాటలో అమ్మాయికి ప్రాధాన్యతతో పాటు, దాన్ని గౌరవంగా భావించేలా ఉండాలి అంటోంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.